### బంగారం ధర మళ్లీ పెరిగింది

నిన్న స్థిరంగా ఉన్న బంగారం ధర నేడు మళ్లీ పెరిగింది. దేశంలో బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల బంగారం ధరపై రూ.440 వరకూ పెరిగింది. ఇక వెండి ధరలు మాత్రం స్వల్పం(400 వరకూ)గా తగ్గాయి. 22 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) 47,750 కాగా.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) 52,090గా ఉంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి.

**బంగారం ధరలు..** హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.47,750.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,090విజయవాడలో 22క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.47,750.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,090


Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 221 మేడ్చల్ మల్కాజ్‌గిరి 31 ఆగస్టు 2023 గురువారం పేజీలు : 4


# ఆ లిస్ట్ ఫైనల్ కాదా?



## ఆటాడుకుంటున్నారుగా!

## కేటీఆర్ వచ్చాక ఆ 20 స్థానాల్లో మార్పులు..!?

## అభ్యర్థుల్లో టెన్షన్ మొదలు

హైదరాబాద్ : తొలి, మలి అని లేకుండా ఒకటే జాబితాలో ఏకంగా 115 మంది అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ .. వారిలో కొందరిని చివరి నిమిషంలో మార్చేస్తారా..? సుమారు 20 మందికి బీఫామ్ ఇవ్వడం కష్టమేనా..? ఆ స్థానాల్లో కొందరు కొత్త వ్యక్తులు, సిట్టింగ్‌లనే మళ్లీ అభ్యర్థులుగా ప్రకటిస్తారా..? మొత్తం 24 అసెంబ్లీ నియోజకవర్గాలపై కేసీఆర్ ప్రత్యేకంగా నిఘా పెట్టారా..? అంటే తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఇవన్నీ అక్షరాలా నిజమేనని తేలింది.
ఇంతకీ ప్రచారం జరుగుతున్న ఆ నియోజకవర్గాలు ఏంటి..? మంత్రి కేటీఆర్ విదేశాల నుంచి వచ్చిన తర్వాత కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందా..? అనే ఇంట్రెస్టింగ్ విషయాలపై ప్రత్యేక కథనం.

**అసలేం జరుగుతోంది..?** ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఊహకందని రీతిలో ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించి కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రకటన అలా వచ్చిందో లేదో పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లు, టికెట్ ఆశించిన ఆశావాహులు, కీలక.. ముఖ్యనేతలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహానికి లోనవుతున్నారు. వీరిలో కొందరు సిట్టింగ్‌లు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేయడానికి కూడా రంగం సిద్ధం చేసుకున్నారు. మరికొందరు సిట్టింగులు, ఆశావాహులు అభిమానులు, కార్యకర్తలు, అనుచరులతో సమావేశాల తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నారు. 'బాబోయ్.. ఈయనకు ఎందుకు టికెట్ ఇచ్చారు..' అని అధిష్టానాన్నే ప్రశ్నిస్తున్నారు. ఇక ఎక్కడ చూసినా అధిష్టానంపై సొంత పార్టీ నేతలు తిరుగుబాటు చేస్తుండటం, రహస్య సమావేశాలు ఏర్పాటు చేస్తుండటం, కాంగ్రెస్, బీజేపీ వైపు పలువురు అడుగులేస్తుండటం లాంటివి జరుగుతున్నాయి. అయితే విశ్వసనీయవర్గాలు, బీఆర్ఎస్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు కేసీఆర్ ప్రకటించిన జాబితాలోని సుమారు 20 మంది అభ్యర్థులకు బీఫామ్ కష్టమేనని తెలిసింది. ఎందుకంటే ఇప్పటికిప్పుడు టికెట్లు ఇవ్వమని చెప్పేస్తే పక్క చూపులు చూస్తారని.. తద్వారా క్యాడర్ దెబ్బతింటుందనే ఉద్దేశంతో ప్రస్తుతానికి ప్రకటించినప్పటికీ తర్వాత మార్పులు, చేర్పులు చేయాలనే కేసీఆర్ ఇలా చేశారట. చివరి నిమిషంలో టికెట్ ఇవ్వమని చెబితే.. అప్పటికప్పుడు తిరుగుబాటు చేసి వేరే పార్టీలో చేరినా పెద్దగా మైలేజీ ఉండదని, కొత్త గుర్తుపై కష్టమేనని బీఆర్ఎస్ భావిస్తోందట. ఇప్పటికిప్పుడు టికెట్ ఇవ్వమని పెద్ద సునామీని క్రియేట్ చేసుకోవడం కంటే.. ఎన్నికలు సమీపించాక ఆచితూచి నిర్ణయం ప్రకటిస్తే సరిపోతుందని బీఆర్ఎస్ అధిష్టానం ఫిక్స్ అయ్యిందట.

**కేసీఆరే చెప్పారుగా.. కేటీఆర్ వచ్చాకే..! :** 'ఈ జాబితాలోని 115 మంది అభ్యర్థులు ఫైనల్ కాదు.. మున్ముందు మార్పులు, చేర్పులు కచ్చితంగా ఉంటాయి' అని అభ్యర్థుల జాబితా ప్రకటించిన రోజే కేసీఆర్ క్లియర్ కట్‌గా చెప్పేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. వాస్తవానికి కేసీఆర్ ప్రకటన చేసినప్పట్నుంచే టికెట్ దక్కించుకున్నా కొందరు ఎమ్మెల్యేల్లో గుబులు మొదలైంది. అయితే తాజా వచ్చిన ఈ సమాచారం ఆ ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయట. ఎప్పుడు ఎలాంటి ప్రకటన వస్తుందో.. చివరికి ఏం జరుగుతుందో..? అసలు పార్టీ తరపున పోటీచేస్తానో లేదో..? అని టికెట్ దక్కించుకున్న నేతలు ఆలోచనలో పడ్డారట. కొందరైతే కేసీఆర్ ఇదేగానీ చేస్తే ప్రత్యామ్నాయంగా ఏం చేయాలనేదానిపై కాంగ్రెస్ పెద్దలతో టచ్‌లోకి కూడా వెళ్లినట్లుగా వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే.. విదేశాల్లో ఉన్న మంత్రి కేటీఆర్ త్వరలోనే హైదరాబాద్ రానున్నారు. వాస్తవానికి చాలా మంది మార్చాలని కేటీఆర్ పట్టుబట్టినప్పటికీ కేసీఆర్ మాత్రం అవన్నీ పట్టించుకోలేదట. దీంతో ఆయన వచ్చాకే మార్పులు, చేర్పులు ఉంటాయని వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు.. తన మిత్రుల్లో కొందరు.. కావాల్సిన మరికొందరికి కేసీఆర్ టికెట్లు ఇవ్వలేదట. వారిలో కొందరి కేటీఆర్ వచ్చాక టికెట్ ప్రకటించే ఛాన్స్ ఉంది.

**ఈ స్థానాల్లోనే మార్పు..! :** ఎక్కడెక్కడ అయితే అసంతృప్తి, ఆందోళనలు ఎక్కువయ్యాయో ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే కేసీఆర్ రహస్య సర్వే కూడా చేయించినట్లుగా భోగట్టా. ఆ సర్వేలు సిట్టింగ్‌లను, టికెట్ దక్కించుకున్న కొత్త వ్యక్తులను కలవరపాటుకు గురిచేస్తున్నాయట. కోదాడ, ఇల్లందు, నాగార్జున సాగర్, ఉప్పల్, అసిఫాబాద్, మహబూబాబాద్, బెల్లంపల్లి, మంథని, కొత్తగూడెం, వరంగల్ ఈస్ట్, మల్కాజిగిరి, కల్వకుర్తి, పెద్దపల్లి, రామగుండం, కంటోన్మెంట్, మానకొండూర్‌తో ఉమ్మడి ఖమ్మంలోని ఇంకొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులపై తీవ్ర వ్యతిరేకత వస్తోందట. సర్వే చేయించినప్పటికీ ఫలితం లేకపోయిందట. దీంతో ఈ స్థానాల్లో టికెట్లు దక్కించుకున్న నేతలు టెన్షన్ పడుతున్నారట. అయితే ఇప్పటికే ఆయా స్థానాల్లో ఎవరిని నియమిస్తే బాగుంటుందని కేటీఆర్ టీమ్ రంగంలోకి ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తోందట. దీంతో టికెట్లు ఆశించిన, సిట్టింగుల్లో ఆశలు చిగురిస్తున్నాయట. ఫైనల్‌గా ఏం జరుగుతుందో.. ఎన్నెన్ని మార్పులు, చేర్పులు జరుగుతాయో..? అసలు ఇందులో నిజానిజాలెంతో తెలియాలంటే కేటీఆర్ వచ్చినంత వరకూ వేచి చూడాల్సిందే మరి.




బెంగళూరు: చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా జాబిల్లిపై దిగిన ల్యాండర్, రోవర్ తమ పనిలో నిమగ్నమయ్యాయి. మధ్యలో కాస్త విశ్రాంతి తీసుకున్నట్టున్నాయి..! ఆ సమయంలోనే బుధవారం ఉదయం రోవర్.. ల్యాండర్ చిత్రాలను తీసింది. తాజాగా వాటిని భారత అంతరిక్ష సంస్థ సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేసింది. 'స్మైల్ ప్లీజ్' అంటూ సరదాగా రాసుకొచ్చింది. 'ఈ రోజు ఉదయం విక్రమ్ ల్యాండర్‌ను రోవర్ క్లిక్‌మనిపించింది. రోవర్‌కు అమర్చిన నావిగేషన్ కెమెరాలు ఈ ఫొటోలు తీశాయి' అని ఇస్రో ఆ పోస్టులో పేర్కొంది. అలాగే నావిగేషన్ కెమెరాలను ఎలక్ట్రో-ఆప్టిక్స్ సిస్టమ్స్ అభివృద్ధి చేసినట్లు తెలిపింది. 140 కోట్ల మంది ఆకాంక్షలను నెరవేరుస్తూ ఆగస్టు 23న చంద్రయాన్-3 జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగిడింది. జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్ సురక్షితంగా దిగిన కొద్దిగంటల తర్వాత రోవర్ బయటకు వచ్చింది. చంద్రుడికి సంబంధించిన తాజా సమాచారం రోవర్ సహాయంతో ల్యాండర్ ద్వారా ఇస్రోకు చేరుతోంది.
14 రోజుల పాటు చంద్రుడి ఉపరితలాన్ని ప్రజ్ఞాన్ పరిశోధించనుంది. రోవర్ పరిశీలించిన విశ్లేషణను ఇస్రో ఎప్పటికప్పుడు పంచుకుంటోంది. అలాగే అక్కడి చిత్రాలను కూడా షేర్ చేస్తోంది.

## వలస పక్షుల గూడుగా కాంగ్రెస్



త్వరలోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వలస పక్షుల గూడుగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్లోకి వలసలు భారీగా ఉంటున్నాయి. బీఆర్ఎస్ లో టికెట్లు దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యేలు, టికెట్ ఆశించి భంగపడ్డ కీలక నేతలు, నాయకులు, బీజేపీలో ప్రాధాన్యత దక్కని లీడర్లు..ఇలా ఇప్పుడు వీళ్లందరి గమ్య స్థానం కాంగ్రెస్గా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అందరి చూపు కాంగ్రెస్ పైనే ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఎన్నికల రేసులో కాంగ్రెస్ పుంజుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి సానుకూల ఫలితాలు వచ్చే అవకాశముందని టాక్. మరోవైపు బీజేపీకి తెలంగాణలో క్రమంగా గ్రాఫ్ తగ్గిపోతుందని అంటున్నారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా బండి సంజయ్ను మార్చి కిషన్ రెడ్డిని నియమించడమే దెబ్బ తీసిందనే వ్యాఖ్యలూ వినిపినిస్తున్నాయి. దీంతో బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని భావన ప్రజల్లోకి వెళ్లిందని టాక్. అందుకే రాజకీయ అవకాశాల కోసం నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై అసంత్రుప్తితో పొంగులేటి శ్రీనివాస్, జూపల్లి క్రిష్ణారావు ఇప్పటికే కాంగ్రెస్లో చేరిపోయారు. మరోసారి టికెట్ దక్కకపోవడంతో ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖా నాయక్ కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే టికెట్ కోసం కాంగ్రెస్లో దరఖాస్తు సమర్పించారు కూడా. మరోవైపు బీజేపీ మాజీ మంత్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇప్పుడు సీతాదయాకర్ రెడ్డి కూడా కాంగ్రెస్లో చేరతానంటున్నారు. మరోవైపు తుమ్మల నాగేశ్వరరావు కూడా కాంగ్రెస్లో చేరే అవకాశాలున్నాయి. ఇక షర్మిల ఏకంగా తన పార్టీనే కాంగ్రెస్లో విలీనం చేసే దిశగా అడుగులు వేస్తుందనే వార్తలు వస్తూనే ఉన్నాయి.



## 'గురిచూసి కొట్టాలి'

## కేసీఆర్ సర్కార్‌పై యుద్ధానికి సిద్ధంకండి

## అమిత్ షా యాక్టివ్ రోల్ తీసుకోబోతున్నారా ?

హైదరాబాద్ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణాలో యాక్టివ్ కాబోతున్నారా ? పార్టీవర్గాలు అవుననే అంటున్నాయి. పార్టీకి ఆధరణ బ్రహ్మాండంగా ఉందని అయితే సరైన నాయకత్వమే లోపిస్తోందని అనుకుంటున్నారట. అందుకనే అధ్యక్షుడు బండి సంజయ్ ఉన్నప్పటికీ అమిత్ షా కూడా యాక్టివ్ రోల్ ప్లే చేయాలని డిసైడ్ అయ్యారట. ఒకరకంగా చెప్పాలంటే బండిని పక్కనపెట్టి కిషన్‌రెడ్డికి బాధ్యతలు అప్పజెప్పినప్పటికీ ఆశించిన ఫలితాలు లేకపోవడంతో అమిత్ షా యే పార్టీపగ్గాలు అందుకోబోతున్నారని పార్టీలో టాక్ నడుస్తోంది. ఇదంతా ఎందుకంటే వచ్చేఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయట. ఈ సమయంలో అగ్రనేతలు గట్టిగా పట్టుబడితే అధికారంలోకి వచ్చేయటం ఖాయమని అనుకుంటున్నారని సమాచారం. కిషన్‌రెడ్డి నాయకత్వానికి వచ్చిన సమస్యేమీ లేదు. అయితే చాలామంది సీనియర్లు కిషన్‌రెడ్డి ఆదేశాలను పట్టించుకోవటంలేదు. ఈటల రాజేందర్ కు పార్టీలోని కొందరు నేతలకు పడటంలేదు. కిషన్‌రెడ్డి కూడా చాలామంది సీనియర్లను కట్టడిచేయలేకపోతున్నారట. ఈమధ్యనే రాష్ట్రానికి చెందిన అత్యంత ప్రముఖ నేతలు సుమారు 20 మందితో అమిత్ షా జేపీ నడ్డా తదితరులు ఢిల్లీలో సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో చర్చల తర్వాత అగ్రనేతలు పై నిర్ణయం తీసుకున్నారట. పార్టీలోకి నేతలను చేర్చుకోవటం టికెట్ల కేటాయింపుల్లాంటి అంశాల్లో నేతల మధ్య గొడవలు జరగకుండా ఇపుడే జాగ్రత్తలు తీసుకోవాలని అనుకున్నారట. అందుకని తానే యాక్టివ్ రోల్ పోషిస్తే ఎలాంటి సమస్యలు తలెత్తవని హోంశాఖ మంత్రికి అనిపించిందట. అంతా బాగానే ఉందికానీ అసలు పార్టీకి క్షేత్రస్థాయిలో బలమెక్కడుందో ఎవరికీ అర్ధంకావటం లేదు. 119 నియోజకవర్గాల్లో పార్టీ జెండాలను మోసేంత కార్యకర్తల బలం లేనేలేదు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లుగా కూర్చోవటం ఓటర్లను బూత్ లకు తరలించి ఓట్లేయించుకునే యంత్రాంగమే పార్టీకి సరిపడా లేదు. ఇక అన్నీ నియోజకవర్గాల్లోను గట్టి అభ్యర్థుల సంగతి మాట్లాడు కోవాల్సిన అవసరమే లేదు. వాస్తవాలు ఇలాగుంటే వచ్చేఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చేస్తుందని అమిత్ షాకు ఎలాగ అనిపించిందో అర్ధం కావటంలేదు. అమిత్ తెలంగాణాలో యాక్టివ్ అయితే పార్టీ పవర్లోకి వచ్చేస్తుందా ? ఏమిటో అంతా మాయగా ఉంది.

## సంపాదకీయం

# ఎన్టీయార్ ని పదే పదే తలచుకుంటున్న మోడీ

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీయార్ జాతీయ రాజకీయాల్లో కూడా తన ముద్ర బలంగా చాటుకున్న నేత. నేషనల్ ఫ్రంట్ చైర్మన్ గా ఆయన ఢిల్లీలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టి కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి ఏపీకి మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎన్టీయార్ ప్రజా నాయకుడిగా కీర్తిని గడించారు. ఎన్టీయార్ పేరు చెబితే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు కళ్ల ముందు కనిపిస్తాయి. ఎన్టీయార్ వేసిన బాటలో ఈ రోజుకు అంతా నడుస్తున్నారు అంటే ఆయన బలమైన ముద్ర తెలుగు రాజకీయాలతో పాటు జాతీయ రాజకీయాల మీద ఉంది అని అర్థం అవుతోంది. ఎన్టీయార్ ని తెలుగుదేశం పార్టీ తరచూ తలచుకుంటుంది. ఆ పార్టీకి ఆయన వ్యవస్థాపకుడు. కానీ ఎన్టీయార్ పేరుని బీజేపీ కూడా ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఇటీవల కాలంలో దేశ ప్రధాని బీజేపీ రథ సారథి నరేంద్ర మోడీ ఎన్టీయార్ ని పదే పదే గుర్తు చేసుకుంటున్నారు. ఆయన గురించే మాట్లాడుతున్నారు. పార్లమెంట్ లో ఆయన మాట్లాడుతూ ఎన్టీయార్ ప్రస్తావన తెచ్చారు. ఎన్టీయార్ తన అనారోగ్యం నిమిత్తం విదేశాల్లో చికిత్స చేయించుకునేందుకు విదేశాలకు వెళ్తే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా ఆయన ప్రభుత్వాన్ని కూలదోసిందని నరేంద్ర మోడీ 1984 నాటి ఉమ్మడి ఏపీ వెన్నుపోటు రాజకీయ పరిణామాలను పార్లమెంట్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఎన్టీయార్ ని నాడు నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటు పొడిచారు. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న ఇందిరా గాంధీ ప్రభుత్వం తెర వెనక పూర్తి సహాయ సహకారాలను అందించింది. ఈ విషయాన్నే మోడీ ఈ రోజు పేర్కొంటూ కాంగ్రెస్ తన ఏలుబడిలో పూర్తిగా అధికార దుర్వినియోగం చేసింది అని అన్నారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టడానికి 356 అధికరణనను యాభై సార్లకు పైగా ఉపయోగించిన చరిత్ర కాంగ్రెస్ ది అని దుయ్యబెట్టారు. ఇక్కడ మోడీ కాంగ్రెస్ ని విమర్శించాలనుకున్నా ఎన్టీయార్ ప్రస్థావనను తీసుకురావడమే విశేషంగా చెప్పుకోవాలి. దీని కంటే కొద్ది రోజుల ముందు బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలలో కూడా మోడీ ఎన్టీయార్ ప్రస్థావనను తెచ్చారు. ఎన్టీయార్ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన తన పార్టీ వారికి సూచించారు. నాడు ఎన్టీయార్ చైతన్య రథం మీద ఊరూరా తిరుగుతూ జనంతో మమేకం అయిన తీరుని కూడా ఆయన బీజేపీ సభ్యులకు వివరించారు. ఇలా ఎన్టీయార్ గురించి మోడీ ఎక్కువగా మాట్లాడుతున్నారు. దీని వెనక వ్యూహాలు ఏమై ఉంటాయన్న చర్చ కూడా సాగుతోంది. ఏపీలో తెలుగుదేశం తో పొత్తుకు విముఖత ప్రదర్శిస్తున్న బీజేపీ పెద్దలు సొంతంగా ఎదగాలని చూస్తున్నారు. ఎన్టీయార్ కి రెండు తెలుగు రాష్ట్రాలలో తరగని ఆదరణ ఉంది. దాంతో ఆయన పేరుని ప్రస్థావించడం ద్వారా ఆ దివంగత నేత అభిమానులను పార్టీ వైపుగా ఆకట్టుకోవాలని బలమైన ఒక సామాజికవర్గం మద్దతు సంపాదించాలన్న ఆరాటం బీజేపీకి ఉంది అని అంటున్నారు. ఇక ఎన్టీయార్ కి భారత రత్న ఇచ్చే ప్రతిపాదన కూడా బీజేపీ సీరియస్ గా పరిశీలిస్తోంది అని అంటున్నారు. వచ్చే ఏడాది లోక్ సభ ఏపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ ఏడాది చివరలో తెలంగాణా అసెంబ్లీ ఎన్నికలు ఉన్న వేళ వీటిని దృష్టిలో పెట్టుకుని ఏదో కీలకమైన సమయంలో ఎన్టీయార్ కి భారత రత్న అవార్డుని కూడా బీజేపీ ప్రకటించే చాన్స్ ఉందని అంటున్నారు. ఇక ఇప్పటికే అమరావతి రాజధానికి అనుకూలంగా కేంద్రంలోని బీజేపీ అతి ముఖ్యమైన స్టెప్ ని తీసుకుంది. అలా అమరావతి ప్రాంత రైతులతో పాటు ఒక బలమైన సామాజికవర్గాన్ని కూడా ఆకట్టుకోవాలన్న ప్రయత్నంలో భాగంగానే దీన్ని చూస్తున్నారు. ఇపుడు ఎన్టీయార్ ని కూడా తమ వాడుగా చేసుకుని గట్టిగా మాట్లాడడం ద్వారా ఆ వర్గం ఓట్లను తిప్పుకోవాలని వ్యూహ రచన చేస్తోంది అని అంటున్నారు. ప్రముఖ నాయకులు ప్రజా నాయకులను తమ వారిగా చేసుకోవడం బీజేపీకి ఏమీ కొత్త కాదు. కాంగ్రెస్ లో పుట్టి పెరిగిన వల్ల భాయ్ పటేల్ ని అలాగే సుభాష్ చంద్ర బోస్ ని విప్లవవీరుడు భగత్ సింగ్ ని తమ వారే అంటూ పొగుడుతూ ఉండే బీజేపీ తెలుగు రాజకీయాలో తన రాజముద్ర వేసిన ఎన్టీయార్ ని కూడా మా వారే అన్నా ఆశ్చర్యం లేదు. బీజేపీ రాజకీయ గడుసుతనంతో కాంగ్రెస్ పటేల్ సుభాష్ చంద్రబోస్ వంటి వారి విషయంలో ఏమీ మాట్లాడలేకపోతోంది. ఏపీలో తెలుగుదేశం కూడా అలా డిఫెన్స్ లో పడేలా ఎన్టీఆర్ కి జై అంటూ భారతరత్నమని బీజేపీ కీర్తిస్తే మాత్రం బిగ్ ట్రబుల్స్ సైకిల్ పార్టీకే అని అంటున్నారు. అంతా.

# అంగన్‌వాడీలకు సాంకేతిక దన్ను





ఖమ్మం : ప్రస్తుతం అన్ని రంగాలు సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకెళ్తున్నాయి. ప్రతీ పనిని సులభతరం చేసుకుంటున్నాయి. సంక్షేమ విభాగంలోని అంగన్‌వాడీ కేంద్రాలూ అదే బాటలో పయనిస్తున్నాయి. ఈ కేంద్రాలు తమ పరిధిలో 16 రకాల రిజిస్టర్లను నిర్వహిస్తాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య సంబంధిత సమాచార సేకరణ అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు భారమవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం 'న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్(ఎన్‌హెచ్‌టీఎస్)' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

నమోదు తప్పనిసరి...అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులకు ఎప్పుడు హాజరవుతున్నారు, ఏ రోజు ఎంతమంది పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందించారు అనే అంశాలను పొందుపరచాలంటే సిబ్బంది తమ చరవాణిలో ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని నమోదు చేసుకోవాలి. ఆధార్‌ను అనుసంధానం చేసిన తర్వాత ఒక ఐడీ జనరేట్ అవుతుంది.

ఎందుకీ యాప్....రిజిస్టర్లు, కాగితాల విధానానికి స్వస్తి పలికి, సాంకేతికతను జోడిస్తూ, అంగన్వాడీ కేంద్రాలపై 24/7 అధికారుల పర్యవేక్షణ ఉండేలా ఇది దోహదపడుతుంది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తప్పనిసరిగా ఈ యాప్‌లో నమోదు కావాల్సి ఉంటుంది. కేంద్రాలను టీచర్లు ఎప్పుడు తెరుస్తున్నారు, హాజరవుతున్నారా? లేదా అనే అంశాలు అధికారులకు తెలుస్తాయి. దీంతో పనిలో పారదర్శకత పెరిగే అవకాశం ఉంటుంది. సేవలను పొందే వారందరి సమాచారం ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. ఆరోగ్య లక్ష్మీ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, 6 సంవత్సరాల పిల్లలకు సరైన సమయంలో పాలు, గుడ్లు, బాలామృతం తదితర పోషకాహారం అందిస్తున్నారా? కేంద్రాల్లో సరిపడా ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయా? అనే సమాచారాన్ని సిబ్బంది యాప్‌లో పొందుపరుస్తారు.

పర్యవేక్షణ మరింత సులభం...

ఈ యాప్ అందుబాటులోకి రాక ముందు అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేస్తున్నాయా, ప్రభుత్వం అందించే అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయా, లేవా అనే వివరాలను జిల్లా సంక్షేమ అధికారి, సీడీపీవో, పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు దేశంలోని ఏ అధికారి అయినా సులభంగా ఎక్కడి నుంచైనా కేంద్రాలను పర్యవేక్షించే అవకాశం ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తెచ్చిందంటే...

పోషణ ట్రాకర్ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్. ఇది దేశంలోని అన్ని రాష్ట్రాలలో అందుబాటులో ఉంది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం అందించే సేవలు, లబ్ధిదారుల వివరాలను సైతం యాప్‌లో పొందుపరచాలనే ఉద్దేశంతో ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రూపొందించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలు వైద్యం, పంచాయతీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖలతో ముడిపడి ఉంటాయి. వీటి సమన్వయం చేసుకుంటూ, పారదర్శకత, నాణ్యతగల సేవలను అందించడం కోసం దీన్ని రూపొందించారు.

వృథాను అరికట్టవచ్చుసీహెచ్ సంధ్య, జిల్లా సంక్షేమ అధికారిగతంలో కేంద్రాలకు ప్రభుత్వం పంపిణీ చేసే పోషకాహార సరకులు పెద్ద మొత్తంలో వృథా అయ్యేవి. అక్రమాలకు తావుండేది. యాప్ వచ్చాక పారదర్శకత పెరిగింది. సరకులు పక్కదారికి పట్టే అవకాశం లేదు.

# వరి.. వెదజల్లు సిరి



ఖమ్మం : వరి సాగులో ఏటా పెట్టుబడులు పెరుగుతుండటం, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బెడదతో దిగుబడులు క్షీణిస్తుండటం వల్ల అన్నదాతలు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు కొందరు ప్రత్యామ్నాయ విధానాలు అవలంబిస్తున్నారు. డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతితో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుంటున్నారు.

పెట్టుబడి భారంతో 'ప్రత్యామ్నాయ' అడుగులు

ఉభయ జిల్లాల్లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 2.83 లక్షల ఎకరాలు. ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సంప్రదాయ పద్ధతిలో నాటు వేయడంతో ఎకరాకు రూ.6వేల వరకు ఖర్చవుతోంది. డీజిల్, ఎరువుల ధరలు పెరగడంతో రూ.3వేల వరకు రైతులపై అదనంగా భారం పడుతోంది. మొత్తమ్మీద ఎకరాకు పెట్టుబడి రూ.25వేలు అవుతోంది. దిగుబడి ఆశాజనకంగా ఉంటే ఎకరాకు రాబడి రూ.40వేలు వస్తుంది. కౌలు రూ.8వేల నుంచి రూ.10వేలు పోతే కౌలుదారులకు మిగిలే పరిస్థితి లేదు. గతేడాది ఖరీఫ్‌లో అధిక వర్షాలతో చీడపీడలు సోకి ఎకరాకు 20 బస్తాలు దిగుబడి కూడా రాకపోవటంతో నష్టపోయారు. సాగు వ్యయం తగ్గించుకునే క్రమంలో అధికారుల సూచన మేరకు గత ఖరీఫ్‌లోనే కొందరు అన్నదాతలు వెదజల్లే పద్ధతిని ఎంచుకున్నారు. ఆశించిన దిగుబడులు రావటంతో అధిక మంది ఈవిధానాన్ని రబీలో అనుసరిస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో 18వేల ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 8వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతి ద్వారా పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ.. నాటు విధానం ద్వారా ఎకరాకు 25కిలోల వరకు విత్తనాలు అవసరం. వెదజల్లే పద్ధతిలో 12-15 కిలోలు సరిపోతాయి. నాటేసేందుకు కూలీలకు ఎకరాకు రూ.6వేలు అవుతుండగా కొత్త విధానం ద్వారా రూ.600తో సరిపెట్టవచ్చు. నారు పెంచి తిరగ నాటడం వల్ల వేర్లు తెగటంతో పిలకలు ఎక్కువొచ్చే అవకాశం ఉండదు. వెదజల్లే పద్ధతిలో నేరుగా పెరగడం వల్ల దుబ్బులు, కంకులు ఎక్కువొస్తాయి. దిగుబడులు పెరుగుతాయి. వెదజల్లే పద్ధతి అవలంబిస్తే పంట ఆరంభంలో మందులతో కలుపును నివారించవచ్చు. పంట త్వరగా కోతకు వస్తుంది.

జిల్లాలో.. వైరా జలాశయం ఆయకట్టు పరిధిలో రబీలో 18వేల ఎకరాల్లో వరి పండిస్తారు. 10వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిని అవలంబిస్తున్నారు. ఏన్కూరులో 5వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. ఇప్పటికే 3వేల ఎకరాల్లో డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతిలో పండిస్తున్నారు. తల్లాడ మండలం వెంకటగిరి, అన్నారుగూడెం, గూడూరు, రామచంద్రాపురం, వెంగన్నపేటలో ఎక్కువ మంది, కొత్త వెంకటగిరిలో రైతులందరూ వెదజల్లే పద్ధతి అవలంబిస్తున్నారు. పెనుబల్లి, కొణిజర్ల, సత్తుపల్లి, వేంసూరు, మధిర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఐదేళ్లుగా 20ఎకరాలలో వెదజల్లే పద్ధతి ద్వారా వరిసాగు చేస్తున్నా. నాటు వేసే విధానం కంటే సులువు. కూలీల ఖర్చు లేకుండా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నా. రోజుకు 5ఎకరాలు చొప్పున ఒక్కడినే వెదజల్లుకుంటున్నా. ఈ ఏడాది ఎకరానికి 35-40బస్తాల దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.5వేలకు పైగా ఖర్చు తగ్గుతుంది. డ్రోన్ ద్వారా మందులు పిచికారీ తేలికగా ఉంది. దిరిశాల రాంబాబు, రైతు కొత్తవెంకటగిరి

# పర్యాటకం.. మాటలకే పరిమితం



దేవరకొండ: దేవరకొండ దుర్గాన్ని రాజధానిగా చేసుకొని వెలమ రాజులు సుమారు 149 సంవత్సరాలు స్వయం ప్రతిపత్తి గల రాజ్యంగా పరిపాలించారని చరిత్రకారులు చెబుతుంటారు. 750 ఏళ్ల కిందట దేవరకొండ ఖిల్లా దుర్గం 500 అడుగుల ఎత్తు, 524 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. శత్రు దుర్భేద్యమైన నిర్మాణం, అద్భుత శిల్పకళా నైపుణ్యంతో పశ్చిమ ప్రాకారానికి రహస్యమార్గం ఉంటుంది. చుట్టూ ఆలయాలతో అష్టదిగ్బంధనం ఉండేలా అద్భుతంగా తీర్చిదిద్దారు. గిరి దుర్గం, సురగిరి, దేవతల కొండగా ప్రాచుర్యం పొందింది. కవి సార్వభౌముడు శ్రీనాథుడు సాహితి పక్షపాతులైన దేవరకొండ సామ్రాజ్యాధిపతులను కలవడానికి ఖిల్లాకు వచ్చినట్లు చరిత్ర చెప్తోంది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని ప్రస్తుతం పట్టించుకునే నాథుడు కరవయ్యారు. మూడేళ్ల క్రితం ఖిల్లా దుర్గాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. రూ.50 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం చేపట్టారు. మిగతా రూ.50 లక్షలతో మెట్లను సరిచేయాల్సి ఉన్నప్పటికీ గుత్తేదారు వాటిని గాలికి వదిలేశారు.

త్వరలో గుర్తింపునకు చర్యలు-రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్యే

దేవరకొండ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా గుర్తించేందుకు అసెంబ్లీలో ప్రస్తావించాను. పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లాను. తొందర్లోనే పర్యాటక కేంద్రంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటాం.

# వేలిముద్ర పడాల్సిందే..


కామారెడ్డి : విధులకు గైర్హాజరైనా దస్త్రాల్లో సంతకాలు పెడుతూ వేతనాలు తీసుకుంటున్న బోధన, బోధనేతర సిబ్బంది ఆటలు ఇక చెల్లవు. కొంతకాలంగా బయోమెట్రిక్ విధానానికి దూరంగా ఉన్న యంత్రాంగం గతేడాది సెప్టెంబరు 1 నుంచి అమలు చేయాలని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో యంత్రాల పనితీరు సక్రమంగా లేక అమలుకు నోచుకోలేదు. ఎట్టకేలకు కొన్ని కళాశాలల్లో బయోమెట్రిక్‌ను ప్రారంభించగా నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ విధానాన్ని పకడ్బందీగా చేపట్టేలా అధికారులు దృష్టిపెట్టారు.

పక్షం రోజులకు నివేదిక

ఎక్కువసార్లు గైర్హాజరయ్యే వారిపై అధికారులు నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. రాకపోవడానికి కారణాలను ఆరా తీయనున్నారు. ఉన్నతాధికారులకు సంజాయిషీ ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. నెలలో రెండుసార్లు నివేదికలు పంపుతారు.

గతంలో జరిగిందిలా

కొందరు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది దస్త్రాల్లో ఒకేసారి రెండు, మూడు రోజుల సంతకాలు పెట్టి బయటకు వెళ్లిపోయేవారు. కళాశాలల్లో విడతల వారీగా విధులు కేటాయించుకునేవారు. ఇది పిల్లల విద్యా



బోధనపై తీవ్ర ప్రభావం చూపింది. పాఠ్య ప్రణాళిక పూర్తికాక వార్షిక ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది.

వచ్చే సంవత్సరం విద్యార్థులకు

షేక్ సలాం, ఇంటర్ నోడల్ జిల్లా అధికారి-కామారెడ్డి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పారదర్శకత కోసమే బయోమెట్రిక్ విధానం తీసుకొచ్చాం. ప్రతి అధ్యాపకుడు నిర్దిష్ట వేళల్లో కళాశాలకు వచ్చి వేలిముద్ర ద్వారా హాజరు నమోదు చేయాలి. వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థుల హాజరుకు దీనినే అమలు చేస్తాం.

రెండేళ్ల తరువాత

కొవిడ్ కారణంగా రెండేళ్లపాటు బయోమెట్రిక్ అమలుకు అవరోధాలు ఎదురయ్యాయి. ప్రస్తుతం కొవిడ్ కేసులు నమోదుకాకపోవడంతో కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తిరిగి అమలు చేయాలని నిర్ణయించారు. బోధన, బోధనేతర సిబ్బంది ఉదయం విధులకు వచ్చినప్పుడు, సాయంత్రం తిరిగి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వేలిముద్ర వేయాల్సిందే.

# ఆధునిక యంత్రం.. ఆదా మంత్రం!

సంగారెడ్డి: వడ్లు నానబెట్టి, విత్తనం మొలకెత్తగానే నారు పోసి, ఎదగగానే కాలం చూసుకొని మహిళలు, పురుషులు పొలంలోని బురదలో దిగి.. నాట్లు చేపట్టడం ఒక ఆహ్లాదకరమైన దృశ్యం. యాంత్రీకరణ ప్రభావంతో మెల్లమెల్లగా మహిళా బృందాల నాటు దృశ్యాలు కనుమరుగవుతున్నాయి. యంత్ర వాహనాలతో క్రమపద్ధతిలో వరి నాట్లు సమయానుకూలంగా పూర్తయి దిగుబడులు పెరుగుతున్నాయి. తమిళనాడు నుంచి వచ్చిన వారు యంత్ర వాహనంతో చిన్నకోడూరులోని రైతు మల్లారెడ్డికి చెందిన ఆరు ఎకరాల్లో నాట్లు వేశారు. బెజ్జంకి మండలం నుంచి యంత్రాన్ని అద్దెకు తెచ్చారు.

25 రోజుల్లోనే..

యంత్రం ద్వారా వేసేముందు మొలకలను ప్లాస్టిక్ షీట్లపై పరుస్తారు. 25 రోజులకు నారు తీసి యంత్రంతో వేయాల్సి ఉంటుంది. రోజులు పెరిగితే చేత్తో నాటేయాల్సి ఉంటుంది. పెరిగిన నారు ఉన్న షీట్లను చాపటా చుట్టి యంత్రంలో అమరుస్తారు. పొలంలో నారును



క్రమపద్ధతిలో వాహనం పరుస్తూ షీట్లను వేరు చేస్తుంది. ఒకరోజులో సుమారు 12 ఎకరాలు నాటేయవచ్చు. ఎకరానికి రూ.4 వేలకు పైగా అద్దె తీసుకుంటున్నారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుంది. కూలీల కొరతను అధిగమించవచ్చు. మరోవైపు మిరుదొడ్డి మండలంలో వరి నాట్లు వేయడం చివరి దశకు వచ్చింది. మహిళలు బృందంగా ఏర్పడి, కూలీ మాట్లాడుకొని వేస్తున్నారు. నారు ముదరక ముందే నాట్లు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మల్లేశం సూచిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 90 శాతం పూర్తయ్యాయి. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో త్వరితంగా వేయాలని.. లేకపోతే తెగుళ్లు సోకుతాయని హెచ్చరిస్తున్నారు.

# మారుమూలలకు వైద్య సేవలు

వేములవాడ : పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం జిల్లాలతోపాటు మండలాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో సారంగాపూర్ నుంచి బీర్‌పూర్, జగిత్యాల నుంచి జగిత్యాల గ్రామీణం, ధర్మపురి నుంచి బుగ్గారం మండలాలను నూతనంగా ఏర్పాటు చేయగా ఇటీవల వెల్గటూర్ నుంచి ఎండపల్లి, మేడిపల్లి నుంచి భీమారంను మండలంగా ఏర్పాటు చేశారు. ఇప్పటికే బీర్‌పూర్, బుగ్గారంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతుండగా మిగతా మండలాల్లో కేవలం తహసీల్దార్ కార్యాలయాలను మాత్రమే ప్రారంభించారు. ప్రస్తుతం నూతనంగా ఆయా మండలాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. దీంతో మారుమూల ప్రాంతాల గ్రామాల్లోని రోగులకు అవస్థలు తీరనున్నాయి. కొన్నేళ్లుగా భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా బీర్‌పూర్ మండల ఏర్పాటుకు ముందు నుంచే అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ ఉంది. హామీలకే పరిమితమవ్వగా నూతనంగా మండలం ఏర్పాటు కావడంతో ప్రభుత్వం పీహెచ్‌సీ ఏర్పాటు చేయడంతోపాటు పోస్టులు మంజూరు చేయడంతో మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెరగనున్న ఆరోగ్యకేంద్రాలు

జిల్లాలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితోపాటు 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 151 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. అంతేకాకుండా 24 గంటల వైద్య సేవలందించేందుకు సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మల్యాల, రాయికల్, కథలాపూర్, పెగడపల్లి, కొడిమ్యాల, ధర్మపురిలో ఆసుపత్రులు ఉన్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రాలు అయిదు కొనసాగుతున్నాయి. అయితే ప్రభుత్వం నూతనంగా బీర్‌పూర్, ఎండపల్లి, భీమారం, బుగ్గారం మండలాల్లో మరో నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేయడమే కాకుండా సిబ్బందిని కేటాయించడంతో సేవలు మరింత దగ్గర కానున్నాయి.

భవన నిర్మాణాలకు స్థల సమస్య

జిల్లా వ్యాప్తంగా 151 ఉప కేంద్రాలు ఉండగా ఇందులో 100కు పైగా అద్దె భవనాలు, అరకొర వసతుల మధ్యనే వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల భవనాలు మంజూరు చేసినప్పటికీ నిర్మాణాల్లో జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం నూతనంగా ఆరోగ్య కేంద్రాలు మంజూరు కావడంతో స్థల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాల్సిన అవసరముంది. ఇప్పటికే ఆయా మండలాల్లో సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు పీహెచ్‌సీల నిర్మాణాలకు స్థల సేకరణ పూర్తి చేసి సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అత్యధికంగా గిరిజనులు

బీర్‌పూర్ మండలంలో 15 గ్రామాలు ఉండగా ప్రత్యేక గిరిజన పంచాయతీలు ఉండడమే కాకుండా మిగతా గ్రామాల్లోనూ అత్యధికంగా గిరిజనులు నివసిస్తున్నారు. వీరందరికీ సమీపంలో వైద్య సేవలందడం ఇబ్బందిగా మారింది. అత్యవసర వైద్య సేవల కోసం జగిత్యాల, ధర్మపురి పట్టణాలకు పరుగెత్తాల్సి వస్తోంది. దూర, వ్యయ భారంతో మండల వాసులు ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడంతో మండల వాసులకు వైద్య సేవలు అందుబాటులో రానున్నాయి.

అందుబాటులోకి సేవలు- ఎం.జయపాల్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి

ప్రభుత్వం నూతన మండలాలకు పీహెచ్‌సీలు, సిబ్బందిని కూడా మంజూరు చేయడంతో రోగులకు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. పీహెచ్‌సీ నిర్మాణానికి స్థల సేకరణ వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

# యాంత్రీకరణ.. దోబీఘాట్

కరీంనగర్ : పని భారం తగ్గించడం..ఉపాధి మెరుగుపర్చ డం.. ఆదాయ మార్గాలను పెంచడానికి.. మోడ్రన్ దోబీఘాట్‌లను అందుబాటులోకి తేవడానికి నగర పాలక సంస్థ ముందుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వీటిని ఏర్పాటు చేస్తుండగా సిద్దిపేట, సిరిసిల్ల ప్రాంతాల్లో వీటిని రజకులకు అప్పగించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా కరీంనగర్‌లోని గోదాంగడ్డ దోబీఘాట్ ప్రాంతాన్ని ఎంచుకొని యాంత్రీకరణ దోబీఘాట్‌ను తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. ఇందుకు రూ.2 కోట్లు కేటాయించగా ఆ పనులు చకచకా కొనసాగుతున్నాయి. టాయిలెట్స్ గదులు, ఆఫీసు రూం, ప్రత్యేక ఎలక్ట్రికల్ రూం, డిటర్జెంట్ స్టోర్‌రూం నిర్మిస్తున్నారు. వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు మేయర్ వై.సునీల్‌రావు చెప్పారు.

కుల వృత్తి సులభతరం

రానున్న రోజుల్లో ఇంటింటా సేకరించిన దుస్తులను మూటకట్టుకొని చెరువులు, వాగుల దగ్గరకు వెళ్లి ఉతికేందుకు, కులవృత్తి చేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో ప్రభుత్వం ఆ వైపు దృష్టి సారించింది. రజక వృత్తికి ఆధునిక సొబగులు అద్దింది. ఈ వృత్తిని సులభతరం చేయడంతోపాటు ఆదాయ మార్గాన్ని అందించేలా యంత్రాలతో ఉతికే ఏర్పాటు చేస్తున్నారు. చెరువులు, జలాశయాల్లోని నీరు కలుషితం కాకుండా చూసేందుకు, నీటిని వృథా చేయకుండా ఏకకాలంలో దుస్తులు ఉతికి ఆరేసి, ఇస్త్రీ చేసి ఇచ్చేలా చర్యలు చేపట్టారు.తక్కువ ఖర్చు..రజక వృత్తిలో ఉండే వారికి సబ్బులతో, నీటితో అనారోగ్య పాలు కాకుండా యంత్రాలతో దుస్తులు ఉతికి ఆరేసేలా



అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. నీటి సమస్య లేకుండా సబ్బులు ముట్టుకోకుండా సర్ఫ్‌తో పని చేయొచ్చు. తక్కువ విద్యుత్తు వినియోగము ంటుంది. వర్షాలు పడిన సమయంలో దుస్తులు తడుస్తాయనే బెంగ కూడా ఉండదు.

పనితీరు ఇలా..మూడు వాషింగ్ మిషన్లు కలిపి 120 కిలోలు సామర్థ్యంతో ఉంటాయి.ఒక గంటకు 240 దుస్తులు ఉతుకుతాయి.

ఒక విడతలో 8 సైకిళ్లు ఉండగా 1920 దుస్తులు, రెండు షిఫ్టులలో 3,840 దుస్తులు ఉతుకుతాయి.ఉతికిన దుస్తుల నీటి తడి తొలగించేందుకు మూడు యంత్రాలు బిగించారు.రెండు డ్రయ్యర్, ఎలక్ట్రిక్ స్టీమ్ రోలర్, రెండు టేబుల్ బాయిలర్, రెండు ఐరన్ టేబుల్స్, మూడు ట్రాలీలు ఉన్నాయి. ఆసుపత్రుల వాటికి ప్రత్యేకంగా..ఆసుపత్రుల నుంచి వచ్చే దుస్తులకు, బెడ షీట్లకు ప్రత్యేకంగా ఉతికేందుకు ఘాట్లు నిర్మిస్తున్నారు. సాధారణ దుస్తులతోపాటు వీటిని వేయకుండా వేరుగా సేకరించి వేరుగానే ఉతికేందుకు నిర్ణయించారు.

# నేత్ర నిధి ఏదీ?



భూపాలపల్లి : సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. ప్రతి మనిషికీ మరణం సహజం. మరణించిన వ్యక్తి కళ్లను దానం చేస్తే వారి నయనాలు ప్రపంచాన్ని చూస్తూనే ఉంటాయి. శరీరంతోపాటు కళ్లను మట్టిపాలు చేయకుండా దానం చేస్తే మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపుతాయనేది నిజం. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో అంధత్వానికి ప్రధానమైన కంటి శుక్లం, వక్రీభవన లోపాలు, కార్నియా దెబ్బతిన్న వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నా, నేత్ర నిధి లేక మృతుల కళ్లు సేకరణ అమలు కావడం లేదు. దానం చేసిన వారి కళ్లను హైదరాబాద్‌లోని సరోజినీదేవి నేత్ర వైద్యశాలకు తరలించి అక్కడే కంటి చూపులేని వారికి ఉపయోగిస్తున్నారు. ఇక్కడి నేత్ర నిధి పూర్తిస్థాయిలో పనిచేసినట్లయితే ఉత్తర తెలంగాణ పరిధిలోని అన్ని జిల్లాల్లో అంధులకు ఇక్కడే కంటిచూపు కల్పించే అవకాశం ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, ప్రాంతీయ నేత్రవైద్యశాల సూపరింటెండెంట్ కన్వీనర్‌గా, డీఎంహెచ్‌వో సభ్యులుగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ పనిచేస్తున్నా.. అంధత్వ నివారణ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో చేపట్టలేకపోతున్నారు.ప్రతి జిల్లాలో కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా అంధత్వ నివారణ సంస్థ పనిచేస్తున్నా.. నేత్రదానంపై ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదు. ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నా... ప్రారంభ కార్యక్రమం బ్యానర్ ఆవిష్కరణతో సరిపెట్టారు. పదిహేను రోజులు ఏ రోజు ఏ కార్యక్రమం చేపడతారన్నది స్పష్టతలేదు. వాస్తవంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఈ పక్షోత్సవాలలో నేత్రదానంపై పాఠశాల, కళాశాలలు, మెప్మా మహిళా సంఘాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉద్యోగులు, కార్మికులు, కంప్యూటర్‌పై పనిచేసేవారికి, చదువుకునే పిల్లలకు, వైద్యసిబ్బందికి అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. అలాంటివి ఏమీ లేకుండా ఆఖరి రోజు ఒక ర్యాలీతో పక్షోత్సవాలు పూర్తిచేస్తున్నారు. ఇప్పటికైనా ఐబ్యాంకు ఏర్పాటయ్యేలా, ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎవరు చేయవచ్చు..

మరణం తర్వాత 4- 6 గంటల మధ్య కళ్లను దానం చేయాలి. వయసు, లింగభేదం లేకుండా ఎవరైనా దానం చేయొచ్చు. అంటు వ్యాధులు, అధిక రక్తపోటు, ఆస్తమా రోగులు, మధుమేహం, కళ్లద్దాలు వాడేవారు కూడా కళ్లను దానం చేయవచ్చు. ఎయిడ్స్, హెపటైటిస్ బి, సి, రేబీస్ బ్లడ్‌క్యాన్సర్, ధనుర్వాతం, కలరా, మెదడు వాపు వంటి వ్యాధులున్న వారు మాత్రం కళ్లు దానం చేయరాదు.

ఇలా చేయండి..

మరణించిన వారి నేత్రాలు దానం చేయాలనుకుంటే మృతుల కంటి రెప్పలను మూసివేయాలి. నేరుగా మరణించిన వ్యక్తి మీద ఏదైనా పంకా ఉంటే నిలిపివేయాలి. కింద ఒక దిండు ఉంచి మృతుని తలపైకి లేపాలి. సాధ్యమైనంత త్వరగా సమీప నేత్రనిధి కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. కళ్ల దానం తర్వాత వైద్యుడి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి.

ముచ్చర్ల గ్రామం ఆదర్శం

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామం నేత్ర దాన హామీలివ్వడంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్ ద్వారా ఆ ఒక్క గ్రామం నుంచే 60 మందికి పైగా ప్రజలు నేత్రదానం చేయడానికి ముందుకొచ్చి హామీ పత్రాలు ఇచ్చారు. మరణించిన వారు నేత్ర దానాలు చేస్తున్నారని, ఏ రాత్రి ఎవరు మరణించినా నేత్రదానం చేయడానికి ముందుకొస్తున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

పిల్లల్లో చైతన్యం

నేత్రదానం చేయడంపై ఇటీవల విద్యార్థుల్లో చైతన్యం వస్తోంది. చాలా మంది స్వచ్ఛందంగా నేత్రదానం చేస్తామని హామీ పత్రాలు అందజేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న అవగాహనతో తమలో చైతన్యం వచ్చిందని విద్యార్థులు చెబుతున్నారు.

ముందుకొస్తున్నారు..చావు బతుకుల్లో ఉన్న తమ కుటుంబ సభ్యుల కళ్లను దానం చేయడానికి చాలా మంది ముందుకొస్తున్నారు. తమ వారు లేకున్నా.. వారి కళ్లు మరొకరి జీవితాలను నడిపించడం ద్వారా ఎక్కడో ఒకచోట తమ వారు బతికే ఉన్నారన్న సంతోషం మిగులుతుందని నేత్రదాన హామీలిస్తున్నారు.అధికారులు సహకరించడం లేదుమల్లారెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల అసోసియేషన్నేత్రదానం, నేత్రాల సేకరణపై కార్యక్రమాలు చేపట్టే జిల్లా అంధత్వ నివారణ సంస్థ కన్వీనర్‌గా ఉన్న వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెం డెంటు సహకరించడం లేదు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు చేపట్టాలి. ఇప్పటివరకు ఎలాంటి కార్యక్రమానికి రూపకల్పన చేయలేదు. కనీస సమాచారం అడిగితే ఇవ్వడం లేదు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ తరఫున ఒక వైద్యురాలు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నందున తక్షణం స్పందించి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

# రోగులకు వరం.. డయాలసిస్ కేంద్రం



వేములవాడ : వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం రోగులకు వరంగా మారింది. డబ్బులు పెట్టి ప్రైవేటు ఆసుపత్రుల్లో సేవలు పొందలేని వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రక్త శుద్ధితోపాటు మందులు ఉచితంగా అందిస్తుండటంతో పేదలకు ఆర్థికభారం తప్పింది. పైగా సేవలు సమీపంలోనే అందుతుండటంతో రోగులకు ప్రయాస తప్పింది.ప్రభుత్వం దీప్ చంద్ డయాలసిస్ సెంటర్ (డీసీడీసీ)తో చేసుకొన్న ఒప్పందం మేరకు ఈ కేంద్రాన్ని దాదాపు రూ.80 లక్షలతో వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ఇటీవల రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఆధునిక వసతులతో ఆసుపత్రిలోని ఓ వార్డులో అయిదు పడకలతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో నెఫ్రాలజీ బృందం వైద్యులతో కోఆర్డినేషన్ చేసుకుంటూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం 16 మంది సేవలు పొందుతున్నారు. వేములవాడ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు ఈ కేంద్రానికి వస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి చెందిన వారు సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లి రక్తం శుద్ధి చేయించుకొని వైద్యం పొందేవారు. ప్రస్తుతం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలోనే రక్తం శుద్ధి చేయించుకొంటున్నారు. ప్రతి రోగికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం అయిదు పడకలున్నాయి. రెండు షిఫ్టుల్లో సేవలు అందిస్తున్నారు.

పేదలకు ఆర్థిక భరోసా

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం పేద రోగులకు ఆర్థికంగా భరోసానిస్తోంది. వేములవాడ పరిసర మండలాలకు చెందిన వారు చాలా మంది నిరుపేదలే ఉన్నారు. వైద్య ఖర్చులు ఆర్థిక భారంగా మారాయి. ప్రైవేటు ఆసుపత్రిలో మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు ఒకసారి రక్తం శుద్ధి చేసుకుంటే దాదాపు రూ. 3 వేల నుంచి రూ. 4 వేలు ఖర్చు అవుతుంది. రవాణా ఖర్చులు, వైద్య పరికరాలకు కలిపి మరో రూ. 5 వేల వరకు అవుతున్నాయి. ఈ ప్రాంతీయ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పేదలకు ఆర్థిక భారం తప్పింది. ఆరోగ్యశ్రీ ద్వారా చేరిన రోగులకు అత్యవసర మందులతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ప్రస్తుతం ఈ డయాలసిస్ కేంద్రంలో ముగ్గురు టెక్నీషియన్లు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, కంప్యూటర్ ఆపరేటర్, ఒక డయాలసిస్ ఎగ్జిక్యూటివ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క రోగికి రక్తం శుద్ధి చేయడానికి కనీసం నాలుగు గంటల సమయం పడుతుంది.రోగి పరిస్థితిని బట్టి వారానికి రెండు, మూడు సార్లు చేస్తారు. వయసును బట్టి దాదాపు 10 లీటర్ల నుంచి 14 లీటర్ల వరకు రక్తం శుద్ధి జరుగుతుందని ఈ కేంద్రం సిబ్బంది తెలిపారు.

సేవలు వినియోగించుకోవాలి- అనిల్, డయాలసిస్ కేంద్రం ఇన్‌ఛార్జి, వేములవాడవేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలందించడం జరుగుతుంది. వేములవాడ పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మూత్రపిండాల వ్యాధిగ్రస్తులు ఈ డయాలసిస్ కేంద్రంలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలి. రోగుల సంఖ్య పెరిగితే షిఫ్టులు పెంచి వైద్య సేవలు అందిస్తాం.

# ఇళ్ల పంపిణీ ఎప్పుడో?

జగిత్యాల : గుత్తేదారుల నిర్లక్ష్యం.. అధికారులు పర్యవేక్షణ లోపం.. నిధుల విడుదలలో జాప్యం.. వెరసి రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు ఏళ్లుగా సాగుతున్నాయి.. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరక నిరుపేదలకు సొంతింటి కల నెరవేరడం లేదు.. ఇళ్లు లేని నిరుపేదలు సొంతింటి కలను నిజం చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పథకాన్ని తీసుకు వచ్చింది. రూ.5 లక్షలతో నిర్మించే ఇళ్ల నిర్మాణ పూర్తి ఖర్చును, ఇంటి స్థలాన్ని, మౌలిక సదుపాయాలు కల్పించి అందించే ఈ పథకం ఇళ్లులేని పేదలకు వరమే.ప్రస్తుతం ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనే వారి కోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది. త్వరలోనే మంజూరు పత్రాలు కూడా అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ రెండు పడక గదుల నిర్మాణాలు పూర్తయినా పంపిణీ చేయడం లేదు. జిల్లాలో ఫేస్-1, ఫేస్-2లో 8255 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఫేస్-1లో 375 ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఫేస్-2లో చేపట్టిన వాటిలో నిర్మాణం పూర్తయి 5557 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో అత్యధికంగా జగిత్యాల పట్టణ శివారులోని నూకపల్లి అర్బన్ కాలనీలో 5115 ఇళ్ల నిర్మాణానికి మంజూరిచ్చారు. ఇందులో 4700 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో 795 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 130 ఇళ్లు మాత్రమే పూర్తిచేశారు. కోరుట్ల నియోజకవర్గంలో వెయ్యి ఇళ్ల నిర్మాణం చేపట్టగా 556 ఇళ్ల పనులు పూర్తి చేశారు. వేములవాడ నియోజకవర్గంలో 230కి 68 ఇళ్ల నిర్మాణం పూర్తిచేశారు. చొప్పదండి నియోజకవర్గంలో 230 కి 130 పూర్తిచేశారు.మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యంజిల్లా వ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లను పంపిణీ చేసేందుకు లబ్ధిదారుల ఎంపికను కూడా పూర్తి చేశారు. కానీ మౌలిక సదుపాయల కల్పన ఆలస్యం అవుతోంది. నూకపల్లి శివారులో నిర్మించిన ఇళ్లలో విద్యుత్తు పనులు దాదాపు పూర్తి దశకు చేరగా రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి వసతి కల్పించాల్సి ఉంది. మిగతా ప్రాంతాల్లో విద్యుత్తు, డ్రైనేజీలు, తాగునీరు లేక పంపిణీ ఆలస్యం అవుతోంది. మరో నెల రోజుల్లో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండటంతో తమకు ఇళ్ల పంపిణీ పూర్తి చేస్తారా లేదా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇళ్లు మంజూరైనా పంపిణీ ఆలస్యం కావటంపై ప్రజాప్రతినిధులు, అధికారులపై ఆగ్రహంగా ఉన్నారు.

# గల్ఫ్ జైళ్లలో మనోళ్లు!

మేడిపల్లి : ఉపాధి కోసం ఊరొదిలినా ఇతర దేశాల్లోని చట్టాలపై అవగాహన లేమితో జైలు పాలవుతున్నారు. తెలిసో తెలియకో చేసిన తప్పులతో దేశం కాని దేశంలో శిక్ష అనుభవిస్తూ న్యాయ సాయం కోసం తల్లడిల్లుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందినవారు ఉపాధి కోసం వెళ్లగా పలువురు జైలు శిక్ష అనుభవిస్తున్నారు. వీరికి ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు కూడా సాయం చేసే స్థితిలో లేకపోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ఇటీవల లోక్‌సభలో గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న వారి అంశంపై చర్చ కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి వివిధ దేశాలకు వెళ్లి కష్టాలు ఎదుర్కొంటున్న వారిపై కథనం...

4,630 మంది భారతీయులు

ఆగస్టు 11న విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి మురళీధరన్ లోక్‌సభకు ఇచ్చిన సమాచారంలో 4,630 మంది భారతీయులు 6 గల్ఫ్ దేశాల జైళ్లల్లో మగ్గుతున్నారని వివరించారు. యూఏఈలో 1,611, సౌదీ అరేబియాలో 1,461, ఖతర్‌లో 696, కువైట్‌లో 446, బహ్రెయిన్‌లో 277, ఒమన్‌లో 139 మంది జైలు జీవితం గడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రాష్ట్రానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉండగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారు కూడా 100 మందికి పైనే ఉంటారని అంచనా వేస్తున్నారు.

మాదక ద్రవ్యాల ముఠా వలలో అభాగ్యులు

ఇటీవల మాదక ద్రవ్యాలు సరఫరా చేసే ముఠాలు అమాయకులైన వారిని వలలో వేసుకుంటున్నాయి. భారత్‌కు వచ్చే వారికి తమ బంధువులకు అప్పగించాలంటూ బ్యాగులు ఇస్తుండటంతో సోదాల్లో డ్రగ్స్ దొరికి తాము ముఠాల చేతిలో మోసపోయామని లబోదిబోమంటున్నారు. గల్ఫ్ చట్టాల ప్రకారం డ్రగ్స్ రవాణా చేస్తే కఠిన శిక్షలు అమలు చేస్తుండటంతో చాలా మంది జైలుకు వెళున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఇటీవలే జైలు శిక్ష పూర్తయి స్వగ్రామానికి చేరాడు. అతనితో పాటే పలువురు ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు జైలు జీవితం గడుపుతున్నారని చెప్పాడు.

ఇవీ ఉదాహరణలు..

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలానికి చెందిన ఓ యువకుడు ఆరు నెలల కిందట మత్తు పదార్థాల రవాణా కేసులో దుబాయిలో జైలు పాలయ్యాడు.

మేడిపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో లేబర్ క్యాంపులో పాకిస్తాన్ యువకుడిపై హత్యాయత్నం చేశాడు. దీంతో జైలు జీవితం గడుపుతున్నాడు.

జగిత్యాల జిల్లా కన్నాపూర్, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ యువకుడు గంజాయి రవాణా కేసులో పదేళ్లుగా దుబాయి జైలులో మగ్గుతున్నారు.

జగిత్యాల మండలానికి చెందిన ఓ వ్యక్తి హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్నాడు. ఆయన కుటుంబసభ్యులు తమ ఇంటిపెద్దకు క్షమాభిక్ష పెట్టించి స్వదేశానికి రప్పించాలంటూ పలుమార్లు వేడుకున్నా ఫలితం లేదు.

ఏయే కారణాలతో..

సందర్శక వీసాలపై వెళ్లిన వారు వివిధ కారణాలతో గడువు ముగిసినా అక్కడే ఉంటున్నారు. ఆయా దేశాల నిబంధన ప్రకారం గడువు ముగిసినా అక్కడే ఉంటే జైలుకు తరలిస్తారు.

ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారు వందల సంఖ్యలో గల్ఫ్‌లోని దుబాయి, అబుదాబి, షార్జా తదితర జైళ్లలో ఉంటున్నారు.

గసగసాలు, పెయిన్ కిల్లర్ల రూపంలోనూ మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తూ కొందరు అమాయకుల జీవితాలతో ఆడుకుంటున్నారు.

గల్ఫ్ సరిహద్దుల నుంచి అక్రమంగా కాలినడకన ఇతర దేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తూ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్తున్నారు.

డ్రగ్స్ ఉచ్చులో పడి పలువురు జీవితఖైదు అనుభవిస్తున్నారు.

మద్యం సేవించిన సందర్భాల్లో కొందరు దాడులు చేస్తూ జైలు పాలవుతున్నారు.

కంపెనీ వీసాపై వెళ్లి జీతం తక్కువగా ఉందనో, పని నచ్చడం లేదనో ఇతర కంపెనీలకు వెళ్తున్నారు. ఈ సందర్భాల్లోనూ అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారు.

దౌత్య సహాయం అందించాలి

-శ్రీనివాసరావు చెన్నమనేని, గల్ఫ్ జేఏసీ

గల్ఫ్ దేశాల్లోని జైళ్లలో ఉన్న అభాగ్యులకు దౌత్య సహాయం అందించాలి. న్యాయ సహాయం కోసం పలువురి కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు. భారత రాయబార అధికారులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమస్య తేవాలి. వివిధ దేశాల్లోని చట్టాలపై కార్మికులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించాలి. పేద కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధి కేటాయించాలి.

# జలం.. ఇక పదిలం

పెద్దపల్లి : సకల జీవ రాశులకు జలమే ప్రాణాధారం. భూగర్భ జలాలు అంతకంతకూ పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యత లేక చాలా ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. ఏటికేడు భూగర్భ జలాలు పడిపోతుండటంతో వాతావరణ అసమతుల్యత కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం వాల్టా(నీరు, భూమి, వృక్షాల చట్టం)ను నవీకరించింది. ఇకపై తాగు, సాగు, పరిశ్రమలు తదితర ఏ రకమైన అవసరాలకైనా బోరుబావి తవ్వకానికి అనుమతిని తప్పనిసరి చేసింది. జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్సు కమిటీలు నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. 'బోర్లకు వాటర్ ఫ్లో మీటర్లు' బిగించుకోవాలని సూచిం చింది. నూతన చట్టం అమలుపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.ఫిర్యాదులపై పట్టింపు కరవు ఉమ్మడి జిల్లాలో గోదావరితో పాటు మానేరు, ఇతర వాగులు ప్రధాన జల వనరులు. ఆయకట్టుతో పాటు ఆయకట్టేతర ప్రాంతాల్లో పంటలు సాగవుతున్నాయి. అయితే పలుమార్లు పంటలకు నీరందక, పెట్టుబడులు వృథా అవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు నీటి మట్టం పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాగు, సాగు అవసరాల కోసం నీటిని విచ్చలవిడిగా తోడేస్తుండటమే ఇందుకు కారణం. నిబంధనలకు విరుద్ధంగా బోరుబావుల తవ్వకం చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక నిషేధిత గ్రామాల్లోనూ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు.

లెక్క తప్పితే జరిమానా నీటి వినియోగంలో మానవ తప్పిదాలను గుర్తించిన ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు నీటి వినియోగంలో పొదుపు పాటించేలా పర్యవేక్షణ పెంచారు. ఇకపై ప్రతి బోరుకు వాటర్ ఫ్లో మీటరు బిగించనున్నారు. నీటి శుద్ధి కేంద్రాలు రోజుకు 50 వేల లీటర్లు వాడితే వెయ్యి లీటర్లకు ఒక రూపాయి చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. పరిశ్రమలు, గనుల నిర్వహణకు 2 లక్షల లోపు లీటర్లకు వెయ్యికి రూపాయి, 2 నుంచి 10 లక్షల లోపు వాడితే వెయ్యి లీటర్లకు రూ.2 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు నీటి వినియోగంలో లెక్కలు లేవు. జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీవాల్టాను పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్సు కమిటీ నియమించనున్నారు. అదనపు కలెక్టర్, తహసీల్దారు, డీఎస్పీ, స్టేషన్ హౌస్ అధికారి(ఎస్సై, సీఐ), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా భూగర్భ జల అధికారి, విద్యుత్తు శాఖ అధికారి సభ్యులుగా కొనసాగుతారు. పరిశ్రమలు, గనుల నిర్వాహకులకు నూతన చట్టం అమలుపై అవగాహన కల్పించనున్నారు. ప్రతి బోరుకు వాటర్ ఫ్లో మీటర్లు బిగించేలా చైతన్యం కల్పించనున్నారు.అప్రమత్తతతోనే వృథాకు అడ్డుకట్ట-రవిశంకర్, జిల్లా భూగర్భ జల శాఖ అధికారినీటి వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. కొత్త చట్టంపై అవగాహన కల్పిస్తాం. అనుమతి లేకుండా బోర్ల తవ్వకాలు చేయరాదు.

# రహదారుల కోత.. ఎన్నాళ్లీ వెత

భూపాలపల్లి : గత నెలలో కురిసిన కుండపోత వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా మోకాలు లోతు గుంతలతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.గత నెలలో కురిసిన కుండపోత వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. అడుగడుగునా మోకాలు లోతు గుంతలతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ వరకు 23 కి.మీ వరకున్న రోడ్డు అధిక వర్షాల కారణంగా రాంపూర్ నుంచి నాగారం మీదుగా ఆజంనగర్ వరకు అనేక ప్రాంతాల్లో గుంతలు పడటంతో చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిపై నుంచి భూపాలపల్లి మండలంతో పాటు మహాముత్తారం మండలంలోని సుమారు పది అటవీ గ్రామాలకు పైగా ప్రయాణికులు వెళ్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయి.కాశీంపల్లి గ్రామ శివారు నుంచి గొర్లవీడు వరకు రోడ్డు పలు ప్రాంతాల్లో గుంతలు పడటంతో వాహనాల రాకపోకలకు



తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. నాచారం వరకు రోడ్డు కూడా అధిక వర్షాలతో పలు ప్రాంతాల్లో కోతకు గురైంది. ఈ రోడ్డు మార్గం నుంచి నాచారం, తాడ్వాయి, మల్లయ్యపల్లి గ్రామాల నుంచి కాశీంపల్లి మీదుగా భూపాలపల్లికి చేరుకుంటారు. రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని పలు అటవీ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామ శివారు నుంచి ఆముదాలపల్లి గ్రామానికి చెందిన రోడ్డు గుంతల మయంగా మారింది. కమలాపూర్ గ్రామ సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంతంలో మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షం పడినా గుంతల నిండా నీరు నిలిచి ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి మధ్యలోని లోలెవల్ కల్వర్టు పైపులు ధ్వంసం కావడంతో వాహనదారులకు గండంగా మారింది.

భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు నుంచి మల్హార్ మండలం అనుసాన్‌పల్లి గ్రామ శివారు నుంచి జంగేడు గ్రామం మీదుగా భూపాలపల్లికి చేరుకుంటారు. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా అనుసాన్‌పల్లి గ్రామ సమీపంలోని వడ్లోనివాగు ప్రాంతంలో వరద తాకిడికి తారు రోడ్డు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలు కొద్ది రోజులుగా నిలిచిపోయాయి. ధ్వంసమైన రోడ్డు విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం మరమ్మతు చేపట్టకపోవడంతో అనుసాన్‌పల్లి గ్రామ సర్పంచి జగన్ సొంతగా ట్రాక్టర్‌తో మొరం పోయించడంతో తాత్కాలికంగా రాకపోకలు కొనసాగుతున్నాయి.రేగొండ మండలంలో భారీ వర్షాలతో కోతకు గురైన రావులపల్లి, పాండవుల గుట్ట రహదారులు మరమ్మతుకు నోచుకోవడం లేదు. గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తిర్మలగిరి శివారు రావులపల్లి నుంచి నారాయణపురం గ్రామాల మధ్య వంతెన రెండు వైపులా వరద తీవ్రతకు రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. పాండవుల గుట్టకు వెళ్లే బీటీ రోడ్డు కల్వర్టు వద్ద పెద్ద బుంగ పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం..**

– తిరుపతి, పీఆర్ ఏఈ, భూపాలపల్లిమండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గ త రోడ్లు గత నెలలో కురిసిన అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. మరమ్మతు పనుల కోసం నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

# సార్లు రాక.. బడుల మూత

భూపాలపల్లి : ఏళ్లుగా మండల విద్యాధికారులు, ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేయకుండా ప్రభుత్వం ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో అటవీ గ్రామాల విద్యార్థులు విద్యకు నోచుకోవడం లేదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులున్న మండలంలోని మారుమూల గ్రామం రెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రెండేళ్లు ఉపాధ్యాయులు సరిగా రాకపోవడంతో తమ పిల్లల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. 46 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించగా ఒకరు ఏడాది కాలంగా, మరొకరు రెండు నెలలుగా అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్నారు. ఉన్న ఇద్దరికి సెలవులు ఇచ్చిన అధికారులు ఇక్కడ మరో ఉపాధ్యాయుడిని నియమించడం మరిచిపోయారు. దీంతో పాఠశాల తలుపులు



తెరుచుకోవడం లేదు. రెండు నెలలుగా సెలవులో ఉన్న ఉపాధ్యాయుడు అంతకుముందు ఎవరి అనుమతి లేకుండా స్వతహాగా అద్దె టీచరును నియమించుకు న్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండలంలోని లింగాపూర్, పర్లపల్లి, పోచంపల్లి పాఠశాలల్లోనూ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల మండలంలోని స్తంభంపల్లి(పి.కె), నర్సింగపూర్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను మండలంలో ఉపాధ్యాయులు లేని పాఠశాలకు కేటాయించకుండా ఒకరిని ఘనపురం మండలానికి, మరొకరి మొగుళ్లపల్లి మండలానికి డిప్యూటేషన్‌పై పంపించడం విమర్శలకు తావిస్తోంది. పైరవీలతో ఉపాధ్యాయులు అనుకూలమైన ప్రాంతాలకు డిప్యుటేషన్లు పొందుతున్నారని విద్యాశాఖ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై మండల ఇన్‌ఛార్జి విద్యాధికారి దేవానాయక్‌ను వివరణ కోరగా బడుల మూసివేత విషయాన్ని ఉన్నతాధికారిల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

# గోదావరి బేసిన్‌లో భూప్రకంపనలు ఎక్కువ



కొత్తగూడెం : 'తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా బేసిన్‌తో పోలిస్తే గోదావరి బేసిన్ ప్రాంతాల్లో భూ ప్రకంపనలు ఎక్కువగా వస్తుంటాయని.. ఇవి చాలా తక్కువ తీవ్రతతో కూడినవి.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అన్నారు భూకంపాల పరిశోధకులు, జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్‌ఐ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.పూర్ణచందర్‌రావు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో వారం వ్యవధిలో రెండుసార్లు భూమి స్వల్పంగా కంపించిన నేపథ్యంలో వీటికి గల కారణాలపై మాట్లాడింది.

**ఎందుకని భూమి కంపిస్తోంది..**

మణుగూరులో వచ్చింది చాలా చిన్న భూకంపం. 12 కేంద్రాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా అక్కడ వచ్చిన భూకంప తీవ్రత 3.1గా నమోదైంది. భూకంపాలకు కారణం.. గోదావరి నది ప్రాంతంలో భూమి లోపల పగుళ్లే. కొన్ని లక్షల ఏళ్ల నుంచే ఈ పగుళ్లు ఉన్నాయి. వీటిపై ఒత్తిడి పెరిగినప్పుడు భూకంపాలు వస్తుంటాయి.

**భూఫలకల కదలికలతో..**

భారత ఉపఖండం ఉత్తర దిక్కు వైపు నెమ్మదిగా జరుగుతోంది. హిమాలయాల వైపు కదులుతూ భూమి లోపలికి, కిందకు వెళుతోంది. ఏటా సుమారుగా 5 సెం.మీ. చొప్పున జరుగుతోంది. వీటినే టెక్టానిక్స్ అంటారు. భూఫలకల కదలికలతో ఒత్తిడి పెరుగుతోంది. భూఫలకలు ఉన్నచోట కూడా భూకంపాలు వస్తుంటాయి. కొన్ని లక్షల సంవత్సరాల నుంచి ఒత్తిడి పెరుగుతూ వస్తోంది. భూకంపాలకు దారితీస్తోంది. దక్షిణాదిలో భూకంపాలకు ఇదే ప్రధాన కారణం.

**జలవనరులు ఉన్నచోట అధికంగా..**

జలవనరులు నిరంతరం ప్రవహించే ప్రాంతాల్లో భూమి బలహీనంగా ఉంటుంది. ప్రవాహంతో అక్కడ భూమి లోపల పగుళ్లు మరింత బలహీనం అవుతాయి. భూఫలకలు జరిగి ఒత్తిడి పెరిగినప్పుడు ఇలాంటి చోట్ల భూ ప్రకంపనలు వస్తాయి. ఇవి చాలా చిన్నవి. వీటితో భయపడాల్సిన అవసరం లేదు.

**ఆనకట్టల వద్ద..**

జలవనరుల ఆనకట్టల వద్ద భూప్రంకపనలు ఎక్కువగా వస్తుంటాయి. నీటి నిల్వతో భారం పడుతుంది. గరిష్ఠ నిల్వ ఉన్నప్పుడు.. ముఖ్యంగా ఎక్కువ వర్షాలు పడినప్పుడు రిజర్వాయర్ ట్రిగర్డ్ ఎర్త్‌క్వేక్స్ వస్తుంటాయి. మహారాష్ట్రలోని కోయిన డ్యామ్ ప్రాంతంలో రోజూ చిన్న భూకంపాలు ఏర్పడుతుంటాయి. గోదావరిలో దీనికంటే తక్కువే వస్తాయి. అప్పుడప్పుడు ఒత్తిడికి గురైనప్పుడు భూప్రకంపనలకు దారితీస్తుంది.

**40 ప్రాంతాల్లో ఉన్నాయ్..**

ఎన్‌జీఆర్‌ఐకు సంబంధించి 40 చోట్ల భూకంపాలను రికార్డు చేసే స్టేషన్లు ఉన్నాయి. భూకంపాలకు అవకాశం ఉన్నచోటల్లా వీటిని ఏర్పాటు చేశాం. విజయవాడ, నిజామాబాద్, అనంతపురం, కర్నూల్ ఇలా అవసరం ఉన్నచోట్లలో కేంద్రాలు పనిచేస్తున్నాయి. హైదరాబాద్‌లో 1960 నుంచే భూకంప పరిశోధన కేంద్రం ఉంది. ఎక్కడ భూకంపం వచ్చినా రియల్‌టైమ్‌లో చాలా స్టేషన్ల నుంచి సమాచారం ఎన్‌జీఆర్‌ఐకి మరుక్షణమే చేరుతుంది. దగ్గరి స్టేషన్ నుంచి సమాచారం తీసుకుని విశ్లేషిస్తాం.

**అతిపెద్దది అప్పుడే..**

తెలుగు రాష్ట్రాల్లో భూకంప తీవ్రత 5 కంటే ఎక్కువగా నమోదైంది మూడు ప్రాంతాల్లోనే. మొదటిది విజయనగరంలో సుమారు 110 ఏళ్ల క్రితం వచ్చింది. ఆ తర్వాత ఒంగోలులో 1967లో సంభవించింది. భద్రాచలంలో 1969లో 5.7 తీవ్రతతో వచ్చిన భూకంపమే ఇప్పటివరకు పెద్దది. మళ్లీ అంతపెద్ద భూకంపాలు ఇప్పటివరకు రాలేదు. భవిష్యత్తులో వచ్చే అవకాశం ఉంది. అందుకే గోదావరి బెల్ట్.. భూకంపాల ముప్పు ప్రాంతాల్లో జోన్–3 పరిధిలో ఉంది. కాస్త ఎక్కువ భూప్రకంపనాలు వచ్చేందుకు అవకాశం ఉన్నట్లు. హైదరాబాద్ జోన్–2లో ఉంది. ఇక్కడ భూకంపాల ముప్పు తక్కువ. హిమాలయాల పర్వత ప్రాంతాలు జోన్–4, 5 పరిధిలో ఉన్నాయి. ఇక్కడ భూకంపాల ముప్పు అధికం. తీవ్రత 8 వరకు ఉంటుంది. ఇంత పెద్దవి మనకు ఇక్కడ రావు. జోన్–3 వరకే తెలుగు ప్రాంతాలు పరిమితం.

# ప్రత్యేక బోధనకు కొలువుల జాతర



కొత్తగూడెం : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో అభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు(చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్) బోధించటానికి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీకి విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. ప్రాథమిక స్థాయిలో, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వేర్వేరుగా పోస్టులు కేటాయించింది. ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఎన్నిచోట్ల పోస్టులు అవసరం ఉన్నాయో రాష్ట్ర విద్యాశాఖకు నివేదిక అందింది. ఒకవైపు డీఎస్సీ, మరోవైపు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియతో కొలువుల జాతర మొదలైంది. డీఎడ్, బీఈడీ అభ్యసించిన అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. ప్రస్తుతం తాజా నోటిఫికేషన్లతో నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్ని కష్టాలు ఎదురైనా కొలువే లక్ష్యంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణత కోసం సన్నద్ధమవుతున్నారు.

**1,371 పాఠశాలల్లో 112 పోస్టులు**

ఖమ్మంలో 291 ప్రాథమిక పాఠశాలల్లో 29 పోస్టులు, 400 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 27, భద్రాద్రిలో 311 ప్రాథమిక పాఠశాలల్లో 31, 369 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 25 పోస్టులు భర్తీ చేయడానికి కార్యాచరణ రూపొందించారు. మొత్తం 1,371 పాఠశాలల్లో 112 పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది లోపు విద్యార్థులుండాలి. 15 మంది విద్యార్థులు పైబడి ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పోస్టుల భర్తీకి సన్నాహాలు చేస్తున్నారు. ఉభయ జిల్లాల్లో సంబంధిత విద్యాశాఖ విద్యార్థుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసింది. ఓవైపు భవిత కేంద్రాలు, మరోవైపు రెగ్యులర్ పాఠశాలల్లో దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి కసరత్తు మొదలైంది. కొవిడ్ సమయంలోనూ ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించటానికి మూడు రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. తాజా నిర్ణయంతో దివ్యాంగ పిల్లల భవితకు భరోసా కలుగుతోంది.

**ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపయుక్తం**
**సోమశేఖరశర్మ, డీఈఓ**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలు 20 శాతం మంది ఉన్నారు. వారికి బోధించడం సాధారణ ఉపాధ్యాయులకు కష్టంగా ఉంటుంది. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు కావాల్సిందే. ప్రభుత్వం నిర్ణయంతో దివ్యాంగ విద్యార్థులకు తల్లిదండ్రులకు భరోసా కలుగుతోంది.

# ఇంటి వద్దే ఓటు వినియోగం!!

మహబూబాబాద్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉన్నాయి. 2023 ఆగస్టు 21న విడుదల చేసిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం 80 ఏళ్లు పైబడిన వృద్ధుల ఓటర్లు 55,599 మంది ఉన్నారు. వీరందరూ త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వరుసలో నిలుచుని ఓటు వేయడానికి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. ఎన్నికల అధికారులు ఈవీఎంతో ప్రత్యేక వాహనంలో నేరుగా మీ ఇంటికే వస్తారు. నిబంధనల వివరాలన్నింటినీ నమోదు చేసుకున్న తర్వాతే ఇంట్లో రహస్యంగానే ఓటు వేయిస్తారు. అయితే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయని వారు స్థానికంగా ఉండే ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో)కి దరఖాస్తు చేసుకోవాలా? లేక బీఎల్‌ఓలు అలాంటి వారిని గుర్తించి ఆ వివరాలను ఆర్వోకి అందిస్తారా.. అనేది తెలియాల్సి ఉంది. విధివిధానాలపై మార్గదర్శకాలు రావాల్సి ఉందని ఎన్నికల సిబ్బంది చెబుతున్నారు. దివ్యాంగులకు వసతులు: దివ్యాంగులు, కాళ్ల నొప్పులతో బాధపడే వారు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లడానికి ర్యాంప్‌లు నిర్మిస్తున్నారు. వాటి పక్కన రెయిలింగ్ కూడా ఏర్పాటు చేస్తారు. ఓటర్లు వాటిని పట్టుకుని అవస్థలు పడకుండా లోనికి వెళ్లొచ్చు. మూడు చక్రాల కుర్చీలను కూడా అందుబాటులో ఉంచుతారు. మంచానికే పరిమితమైన దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆలోచనతో అవస్థలు పడుతూ వెళ్లి ఓటు వేసే వారున్నారు. వేయకుంటే ఏం కాదులే అనుకుంటూ ఇంట్లోనే ఉంటున్న వారున్నారు. ఈసారి అలాంటి సమస్య ఎదురుకాదు. ఎన్నికల అధికారులే మీ ఇంటికి ప్రత్యేక వాహనంలో ఈవీఎంతో వస్తారు. మీ చేత ఓటు వేయించుకుని వెళ్తారు.

ఇంట్లో మంచంపై ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ఈవీఎంలో రహస్యంగా ఓటు హక్కును వినియోగించుకుంటున్న వయోవృద్ధురాలిది కర్ణాటక రాష్ట్రం. 2023 మే 10న కర్ణాటక శాసనసభ ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోలేని 80 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, మంచానికే పరిమితమైన దివ్యాంగుల కోసం ఎన్నికల సంఘం ఇంటి వద్దే ఓటు వినియోగించుకునే సదుపాయాన్ని కల్పించింది. ఈ విధానం అక్కడ సత్ఫలితాలు ఇచ్చింది. త్వరలో మన రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ విధానాన్ని వినియోగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**స్వాగతిస్తున్నాం: చలమల్ల రవి, పెద్దనాగారం, నర్సింహులపేట**

నాకు 35 సంవత్సరాలు. 2019లో మూడు చక్రాల కుర్చీలో వెళ్లి ఓటు వేశాను. అయినా ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు ప్రభుత్వం పూర్తిగా మంచానికే పరిమితమైన దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోంచుకునేలా అవకాశం కల్పించడం సంతోషంగా ఉంది.

**గత ఎన్నికలప్పుడు ఇబ్బంది పడ్డా: నిర్మలా జైన్, డోర్నకల్**

నాకు 81 సంవత్సరాలు. ప్రతి ఎన్నికలో ఓటు వేశాను. వృద్ధాప్యం కారణంగా గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలప్పుడు కొంత ఇబ్బంది పడ్డా. కుటుంబ సభ్యుల సహకారంతో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశా. ఈసారి నాలాంటి వృద్ధుల కోసం ఇంటి వద్దకే ఓటు వేసే యంత్రం వస్తుందని తెలిసింది. వృద్ధుల ఓట్లకు ఎన్నికల సంఘం ఇలా అండగా నిలవడం శుభ పరిణామం.

# జిల్లాకు అత్యవసర వైద్య సేవల విభాగం

జయశంకర్ : ఇదివరకు జిల్లాలో సరైన వైద్యం అందక ఇబ్బందులు ఎదురయ్యేవి. అనారోగ్య సమస్యలు, ప్రసవాలకు కూడా దూరప్రాంతాలకు లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రి (జిల్లా ఆసుపత్రి) ప్రారంభం కావడంతో వైద్య సేవలు మెరుగయ్యాయి. మొదటగా మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)తో మొదలై వివిధ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. రక్తనిధి కేంద్రం(బ్లడ్ బ్యాంక్), వయోవృద్ధులకు ఉపశమన కేంద్రాలు(పాలియేటివ్ కేర్ యూనిట్), నవజాత శిశువులకు ప్రత్యేక కేర్ యూనిట్(ఎన్‌ఎన్‌సీయూ), జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ) తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్టిక్ హబ్(టీ హబ్), తదితర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మెడికల్ కళాశాల మంజూరైంది. వీటికితోడు అత్యవసర వైద్యసేవల విభాగం(క్రిటికల్ కేర్ యూనిట్) అందుబాటులోకి రానుంది.

రూ.10 కోట్లతో..ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. జిల్లాలో అత్యవసర వైద్యసేవలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.10 కోట్లతో భవనం నిర్మించనున్నారు. 50 పడకల సామర్థ్యంతో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వైద్య కళాశాల వెనుక ఖాళీ స్థలంలో సీసీయూ(క్రిటికల్



కేర్ యూనిట్) భవనం నిర్మించనున్నారు. ఇప్పటికే అక్కడ మట్టి పరీక్షలు చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తికానుంది. త్వరలోనే గుత్తేదారుతో అగ్రిమెంట్ చేసుకొని పనులు ప్రారంభించనున్నారు.

**ప్రత్యేక సిబ్బంది, పరికరాలు**

అత్యవసర వైద్య సేవలకు సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రైవేటు లేదా వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. రహదారి ప్రమాదాలు, ఇతర అత్యవసర కేసుల్లో సమయానికి సరైన వైద్యం అందించడం ఎంతో కీలకం.. అందుబాటులో క్రిటికల్ కేర్ యూనిట్ ఉంటే అత్యవసర విభాగంలో సరైన సమయంలో వైద్యం అందుతుంది. ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చు. యూనిట్‌లో ప్రత్యేక వైద్య సిబ్బంది, అత్యాధునిక పరికరాలు ఉంటాయి. దీంతో కార్పొరేట్‌కు దీటుగా వైద్యం అందనుంది.

**మెరుగైన వైద్య సేవలందుతాయి– భవేశ్ మిశ్రా, జిల్లా కలెక్టర్**

జిల్లా ఆసుపత్రి, మాతా శిశు కేంద్రంతో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే త్వరలోనే వైద్య కళాశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. నూతనంగా జిల్లాకు అత్యవసర వైద్యసేవల విభాగం (క్రిటికల్ కేర్ యూనిట్) మంజూరైంది. త్వరలోనే సీసీయూ భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

# ఆకర్షణీయ పనుల్లో జాప్యం.. పురస్కారం దూరం

మహబూబాబాద్: నాలుగో ఇండియా స్మార్ట్ సిటీ (ఆకర్షణీయ నగరం)–2022 అవార్డులను కేంద్ర ప్రభుత్వం మూడ్రోజుల కింద ప్రకటించింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ ప్రథమ స్థానంలో నిలిచింది. పారిశుద్ధ్య విభాగం (ఘన వ్యర్థాల నిర్వహణ)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు రెండో బహుమతి దక్కింది. కేంద్రం మొదట ఎంపిక చేసిన వంద స్మార్ట్ సిటీస్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి గ్రేటర్ వరంగల్, కరీంనగర్ ఉన్నా.. ఏ కేటగిరిలోనూ అవార్డులు దక్కలేదు. స్మార్ట్‌సిటీ పనుల్లో జాప్యం కారణంగా వరంగల్ నగరం పురస్కారానికి దూరమైంది. 2022 ఏప్రిల్‌లో సూరత్ నుంచి నాలుగో విడత ఆకర్షణీయ నగరాల ఎంపిక పోటీ ప్రక్రియ ప్రారంభమైంది. పోటీల్లో పాల్గొనే అర్హత 80 నగరాలకు దక్కింది. మొత్తం 845 నామినేషన్లు ఉండగా.. వాటిని ఐదు దశల్లో వడపోసి ఉత్తమ ఆకర్షణీయ నగరాలను ఎంపిక చేయగా.. గ్రేటర్ వరంగల్‌కు ఐదు కేటగిరిల్లో ఒక్కదాంట్లోనూ అవార్డులు దక్కలేదు. నాలుగేళ్లలో పెద్దగా చెప్పుకోదగిన ప్రాజెక్టులు పూర్తికాకపోవడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

ఇదీ పనుల తీరు..రాంపూర్ డంపింగ్‌యార్డులో సుమారు 4.50 లక్షల టన్ను వ్యర్థాలున్నాయి. ఏడాదిన్నర క్రితం బయోమైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించి, నాలుగు నెలలకే పనులు ఆపేశారు. యంత్రాలు పని చేయడం లేదని సాకులు చెబుతున్నారు. ఇంజినీర్ల అశ్రద్ధ, అవగాహన కలిగిన అధికారి లేకపోవడంతోనే పనులు నిలిచిపోయాయి.

వరంగల్ పోతన మందిరం, బాలసముద్రంలో ఆధునిక చెత్త రవాణా కేంద్రాల పనులు పూర్తికాలేదు. స్వచ్ఛ ఆటోలు చెత్తను డంపు చేయడానికి ఇబ్బందులు తప్పడం లేదు.

పోతననగర్‌లో అధునాతన ధోబీఘాట్ పనులు ఏడాదిన్నర అవుతున్నా ఇంకా అరకొర పనులు మిగిలే ఉన్నాయి. తీసుకొచ్చిన ఆధునిక యంత్రాలు ఇటీవల వరదలకు నీట మునిగి పాడయ్యాయి.

గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) పనులు మొదలై పది నెలలైనా పూర్తికాలేదు.కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో రోజూ 120 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) మురుగు నీరు వెలువడుతోంది. ఉర్సు చెరువు వద్ద 05 ఎంఎల్‌డీలు, కాజీపేట బంధం చెరువు వద్ద 15 ఎంఎల్‌డీల మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రాల నిర్మాణం కొనసాగుతూనే ఉంది. హనుమకొండ రెడ్డిపురంలో 100 ఎంఎల్‌డీల మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటును స్థలం లేదంటూ రద్దు చేశారు. అమ్మవారిపేటలో 120 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన మానవ వ్యర్థాల నిర్వహణ కేంద్రం పనులు కొనసాగుతునే ఉన్నాయి.

స్మార్ట్ రోడ్లు, జంక్షన్లు ఇతర పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

వినూత్న ప్రాజెక్టులేవీ?దేశ వ్యాప్తంగా స్మార్ట్‌సిటీ నగరాల్లో వినూత్న (ఇన్నోవేషన్) ప్రాజెక్టులు ప్రతిపాదించారు. ఇండోర్, సూరత్ నగరాల్లో అన్ని పనులు వినూత్నమే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైజాగ్ సిటీలో నీటిపై తేలియాడే సౌరశక్తి కేంద్రం (సోలార్ ప్రాజెక్టు), కాకినాడలో ఆధునిక విధానాలతో స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ టవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వరంగల్ విషయానికి వస్తే వినూత్న పనులు తక్కువే. బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులే అధికం. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. సైకిల్ ట్రాక్‌కు గుర్తింపు స్మార్ట్ సిటీస్ 2020 అవార్డుల్లో గ్రేటర్ వరంగల్ రెండు, మూడు కేటగిరీల్లో స్థానం దక్కించుకొంది. కాజీపేట ఫాతిమానగర్ నుంచి సుబేదారి వరకు రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన సైకిల్ ట్రాక్ పనులకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. రూ.98.94కోట్లతో 33 పనులు పూర్తయ్యాయి.

# పల్లెల్లో సౌర కాంతులు

కరీంనగర్ : పొదుపు సంఘం మహిళలకు విద్యుత్తు బిల్లుల భారం తగ్గించేలా గ్రామీణాభివృద్ధి సంస్థ కృషి చేస్తోంది. స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘం(ఎస్ హెచ్‌జీ) సభ్యులు సొంతంగా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకునేలా పథకాన్ని రూపొందించింది. జిల్లాకు 500 యూనిట్లు లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటి వరకు ఔత్సాహిక మహిళలు 50 మంది వరకు యూనిట్ నెలకొల్పటానికి ముందుకొచ్చారు. పర్యావరణ పరిరక్షణకు అధికారులు అతివలను సమాయత్తం చేస్తున్నారు.

యూనిట్ల ఏర్పాటుకు సదస్సులు

సోలార్ యూనిట్లు నెలకొల్పడానికి స్వశక్తి మహిళలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. విధివిధానాలపై తర్ఫీదు ఇస్తున్నారు. సభ్యురాలు గృహ అవసరాల నిమిత్తం నెలకు 200-300 యూనిట్లు వాడుకున్నట్లయితే 2 కేవీ, 3 కేవీ సౌర విద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశముంది. పలకలు బిగించడానికి సుమారు 160-200 చదరపు అడుగుల ఆర్‌సీసీ భవనం ఉండాలి. నెల వారీగా వినియోగించే కరెంటు ఆధారంగా, ఎంత సామర్థ్యం అవసరమో అధికారులు అవగాహన కల్పిస్తారు. ఈ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తోంది.

లాభాలు ఇలా..ఇప్పటివరకు చెల్లిస్తున్న బిల్లుల డబ్బులు మిగులుతాయి. నిర్వహణ ఖర్చులు ఉండవు. వినియోగించుకోగా, మిగిలితే గ్రిడ్‌కు



సరఫరా చేసే వీలు ఉంటుంది. పెట్టుబడి 5 ఏళ్లలో తీరనుంది. సౌర పలకాల వారంటీ 25 ఏళ్లపాటు, యూనిట్‌కు ఐదేళ్లపాటు ఉంటుంది.

అవగాహనతో ముందుకొచ్చాను- గనికంటి హారిక, బొమ్మకల్, కరీంనగర్ గ్రామీణం నేను ధనలక్ష్మి గ్రామ సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. సోలార్ యూనిట్ నెలకొల్పితే లాభాలు బాగుంటాయని అవగాహనతో ఈ నిర్ణయం తీసుకున్నాను. అవసరమైన పరికరాలు, సామగ్రిని అధికారులు సమకూర్చుస్తామన్నారు. మాకు స్త్రీనిధి రుణం ఇస్తామన్నారు.రెండు నెలల్లో లక్ష్యం సాధిస్తాం- ఎల్.శ్రీలత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, కరీంనగర్

ప్లాంట్ ఏర్పాటుకు స్వశక్తి సంఘ సభ్యులకు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 50 మంది ముందుకొచ్చారు. మార్చి ఆఖరు వరకు లక్ష్యం చేరడానికి క్షేత్ర స్థాయి సిబ్బంది కృషి చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ముందుకొచ్చిన వారికి తక్షణమే స్త్రీనిధి రుణం అందజేస్తాం.

# తెరపైకి శివారు కాలనీల అభివృద్ధి

కరీంనగర్ : భగత్‌నగర్ విఘ్నేశ్వరకాలనీ రోడ్డు నెం.3లో నాలుగేళ్ల కిందట రోడ్డు పనులు చేస్తామంటూ తవ్వి వదిలేశారు. తీరా పనులు చేయకపోగా కాలనీవాసులే ఎవరికీ వారు మొరం పోసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. దుమ్మూ, ధూళితో ఇబ్బందులు పడుతుండగా కనీసం ఇప్పుడైనా పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.గత నాలుగైదు ఏళ్లుగా నిధులు మంజూరు కావడంలేదనే సాకుగా చూపించి ప్రారంభించకుండా వదిలేసిన అభివృద్ధి పనులకు మోక్షం కలగనుంది. టెండర్లు దక్కించుకొని పాత ధరలతో గిట్టుబాటు కాదనే కారణాలతో మొండికేసిన వాటిని రద్దు చేసి తాజాగా మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించారు.కరీంనగర్ నగర పాలక సంస్థకు ముఖ్యమంత్రి హామీతో కనీస సౌకర్యాలు కల్పించుకోవడానికి ప్రత్యేక నిధులు కేటాయించారు. మొత్తం మూడు విడతలుగా రూ.347.23 కోట్లు నగరానికి మంజూరయ్యాయి. మొదటి విడత మార్చి 2017లో రూ.100 కోట్లు, రెండో విడత డిసెంబరు 2017లో రూ.147.23 కోట్లు, సెప్టెంబరు 2018లో మూడో విడతలో రూ.100 కోట్లు కేటాయించారు. ఆ సమయంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులే కనిపించాయి.

అత్యధిక ప్రాంతాల్లో సౌకర్యాలు

ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రెండున్నర ఏళ్లు ఎక్కడ చూసినా అభివృద్ధి పనులే కనిపించాయి. అత్యధిక ప్రాంతాల్లో సీసీ, తారు రోడ్లు, మురుగునీటి కాల్వలు, లింకు రోడ్లు, సీసీ కెమెరాలు, తాగునీటి పైపులైన్లు, సామాజిక భవన నిర్మాణాలు, శ్మశానవాటికల అభివృద్ధి, కూడళ్ల సుందరీకరణ, పార్కుల పనులు వంటివి చేపట్టారు. ఆ సమయంలో ఏళ్ల తరబడి నలుగుతున్న సమస్యలు కూడా పరిష్కారమయ్యాయి. అప్పుడూ చేపట్టిన పనులతో కొన్ని ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయి.

వదిలేయడంతో అవస్థలు

మూడు విడతలుగా మంజూరైన అభివృద్ధి పనుల్లో అత్యధిక శాతం పూర్తి చేయగా అందులో కొన్నింటిని ప్రారంభించకుండా వదిలేశారు. ముందు చేపట్టిన వాటికి బిల్లులు సకాలంలో రాకపోవడంతో టెండర్లు దక్కించుకున్న వారు సైతం మొదలు పెట్టలేదు. ప్రారంభించిన చోట రోడ్లు, కాల్వలు తవ్వి పూర్తి చేయకుండా ఏళ్లుగా వదిలేశారు.

ఆసక్తి చూపని గుత్తేదారులు

సీఎంఏ నిధుల కింద టెండర్లు దక్కించుకొని అభివృద్ధి పనులు చేయకుండా వదిలేసిన వాటిని రద్దు చేయాలని నిర్ణయించారు. పాత ధరలతో టెండర్లు పిలవడంతో గుత్తేదారులు సైతం ఆసక్తి చూపడం లేదంటున్నారు. అయితే పలుచోట్ల స్మార్ట్‌సిటీ, ఇతర నిధులతో అందుల్లోని సగం మేర పూర్తయ్యాయి. మిగతా కొన్ని పెండింగ్ పనులతోపాటు కొత్తగా శివారు కాలనీలను ఇందుల్లో తీసుకొని టెండర్లు పిలిచే ఆలోచనలో ఉన్నారు. రూ.347.23 కోట్లలో రూ.109 కోట్లు మిగిలినట్లు సమాచారం. కొత్త ఎస్‌ఆర్‌ఆర్ ధరల ఆధారంగా వీటికి టెండర్లు పిలిచి పూర్తి చేయాలని భావిస్తున్నారు. సీఎంఏ నిధుల కింద టెండర్లు దక్కించుకొని అసంపూర్తిగా చేపట్టిన అభివృద్ధి పనులను ఇందులో పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరముంది.

గుర్తించిన కొన్ని ప్రధాన రహదారులు కోతిరాంపూర్ కాకతీయ ఫంక్షన్‌హాల్ నుంచి కోతిరాంపూర్ చౌరస్తా మీదుగా కట్టరాంపూర్ వరకు.మంకమ్మతోట బుక్‌స్టాల్ నుంచి జ్యోతినగర్ వెళ్లు రోడ్డు.చైతన్యపురి స్పెన్సర్ నుంచి విద్యానగర్ వరకు. దోబీఘాట్ నుంచి సప్తగిరికాలనీ రహదారి.త్వరలోనే టెండర్లు- వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్మిగిలిన సీఎంఏ నిధులతో త్వరలోనే టెండర్లు పిలిచి మూడు నెలల్లో పనులు పూర్తి చేయిస్తాం. పాతవి రద్దు అవుతాయి. శివారు కాలనీలకు, గతంలో వదిలేసి ప్రారంభించని వాటికి ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

# ఎప్పుడు వస్తుందో.. ఏమో?



జగిత్యాల : ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో రైతులు యాసంగిలో వరి నాట్లు వేశారు. ప్రారంభంలో వ్యవసాయ సాగుకు సరిపడా విద్యుత్తు సరఫరా చేయటంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పూర్తిస్థాయిలో వరి పంట సాగు చేశారు. అయితే కొద్ది రోజులుగా సమయపాలన లేని అరకొర విద్యుత్తు సరఫరాతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. రాత్రినక, పగలనక పంట పొలాల వద్దనే నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. బోరు, వ్యవసాయ బావుల్లో నీరున్నా విద్యుత్తు సమస్యతో పంట పొలాలకు నీరందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 1.70 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. జిల్లాలో ఎక్కువగా వ్యవసాయ, బోరుబావుల కింద వరిసాగు చేస్తుంటారు. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటంతో వర్షాకాలంతో పోలిస్తే యాసంగిలో 20 వేల ఎకరాలకు పైగా అధికంగా వరి సాగు చేశారు. వర్షాకాలంలో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలు చేతికందడంతో వాటిని తొలగించి వరినాట్లు వేశారు. నాట్లు పూర్తి కాగా పంట ఎదుగుదల, పొట్ట దశల్లో ఉంది. ఈ ఏడాది వరి పంటకు ఆరంభంలోనే మొగిపురుగు, చీడపీడల బెడద తీవ్రమైంది. పంటల సస్యరక్షణకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇప్పుడిప్పుడే వరి పంట చీడపీడల నుంచి బయటపడుతోంది. ప్రస్తుతం అన్నదాతను విద్యుత్తు సమస్య వేధిస్తోంది. గత కొన్ని రోజులుగా సమయపాలన లేని అరకొర విద్యుత్తు సరఫరాతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్తు సరఫరాకు కచ్చితమైన సమయం లేదు. దీంతో కర్షకులు పంట పొలాల వద్ద రాత్రి, పగలూ అనే తేడా లేకుండా నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. నీరున్నా పంటకు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటోమెటిక్ స్టార్టర్లతో విద్యుత్తు మోటార్లు కాలిపోయి వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు. విద్యుత్తు కోసం పంట పొలాల వద్ద రాత్రి వేళ రైతులు నిరీక్షించే సమయంలో విష పురుగులు, విద్యుదాఘాతాలతో ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా సెస్ అధికారులు స్పందించి విద్యుత్తు సరఫరాను సక్రమంగా చేయాలని కోరుతున్నారు.పెట్టుబడులు పెరిగాయి- లింగాల సత్తయ్య, రైతు, మర్తన్‌పేటయాసంగిలో నాకున్న 9 ఎకరాల్లో బోరు, వ్యవసాయ బావి సహాయంతో వరి సాగు చేశాను. గతంతో పోలిస్తే వరి సాగుకు ఈ ఏడాది ఎరువులు, విత్తనాలు, కూలీలకు, ట్రాక్టర్ దమ్ముకు రేట్లు పెరిగి పెట్టుబడి వ్యయం పెరిగింది. ఇప్పటికే వరిసాగుకు రూ.1.80 లక్షలు వెచ్చించాను. చీడపీడల బెడద ఎక్కువ ఉండటంతో ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం కనిపించటం లేదు. ప్రభుత్వం 24 గంటలూ ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తామన్నది. కచ్చితమైన సమయంతో 15 గంటలు సరఫరా చేసినా విద్యుత్తు కష్టాలు తొలుగుతాయి.

వరి పంట ఎండుతోంది- ఎనుగుల భూమయ్య, రైతు, రహీంఖాన్‌పేట నాకున్న 6 ఎకరాల్లో బోరు, వ్యవసాయ బావి సహాయంతో వరిసాగు చేశాను. పంట పొట్ట దశలో ఉంది. బావిలో నీరున్నా అరకొర విద్యుత్తు సరఫరాతో వరి పంటలు ఎండుతున్నాయి. సమయపాలన లేకుండా పగలు 4 గంటలు, రాత్రి వేళ 2 నుంచి 3 గంటలు సరఫరా అవుతోంది. ఎప్పుడు వస్తోందో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్దనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు, పాలకులు స్పందించి రైతులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తే బాగుంటుంది. విద్యుత్తు సమస్య ఇలాగే కొనసాగితే రైతులకు అప్పులు, ఆత్మహత్యలు తప్పవు.

త్వరలోనే సమస్య పరిష్కారం- బి.సత్తయ్య, సెస్ ఏడీఈ, వేములవాడ విద్యుత్తు గ్రిడ్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యతో విద్యుత్తు సరఫరాకు సమస్య తలెత్తింది. రైతులకు సరిపడా విద్యుత్తు సరఫరా చేస్తున్నాం. కొంతమేరకు సమయపాలన లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సెస్ ఎండీ దృష్టికి తీసుకెళ్లగా గ్రిడ్ అధికారులతో మాట్లాడుతున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమై రైతులకు కచ్చితమైన సమయానికి నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయటానికి కృషి చేస్తున్నాం.

# గుట్టుగా గంజాయి దందా!



కరీంనగర్ : గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1200 గ్రాముల సరకు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని ప్రాంతానికి చెందిన దుర్గం రమణ, జీవన్, కరీంనగర్ కొత్తపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన గాజుల మహేష్ ఉన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నటేష్ తెలిపారు. జిల్లాలో మత్తు వ్యాపారం చాపకింద నీరులా వ్యాపి స్తోంది. పోలీసులు దాడులు చేసి విక్రయదారులను పట్టుకుంటున్నా గుట్టుగా కొనసాగుతూనే ఉంది. ఈ మధ్యకాలంలో యువత, విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారుతుండడం ఆందోళన కల్గిస్తోంది. జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఈ చెడు దారిని ఎంచుకుంటున్నారు. ఇలా కొందరు యువకులు విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. మత్తు కోసం వారు కొత్త విధానాలను అనుసరిస్తూ వ్యసనం బారిన పడుతున్నారు. జిల్లాలో గంజాయి దందా తీరుపై కథనం.

హుషారు ఎక్కించే హుక్కా..మత్తుకు బానిసైన వారు ఏదో ఒక తరహాలో దాన్ని తీసుకునేందుకు అలవాటుపడిన వారి తీరును చూసి అధికారులే ఆశ్చర్యపోతున్నారు. గంజాయి ఆకు పొడిని సిగరెట్లలో వాడుతున్న విషయం తెలిసిందే. ఈ మధ్య నూనె సైతం వినియోగిస్తున్న విషయాన్ని పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది గుర్తించారు. కొత్తగా హుక్కా మాదిరిగా గంజాయిని కొందరు యువత వినియోగిస్తున్నట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పసిగట్టారు. ప్లాస్టిక్ సీసాకు చిన్న రంధ్రం చేసి.. హుక్కా మాదిరిగా పీల్చుతుండగా పోలీసులు పట్టుకున్నారు.

చదువుకు స్వస్తి... జల్సాలతో మస్తీ..యువతే దేశాభివృద్ధి వెన్నుముక అంటారు. కానీ కొందరు యువత మద్యం, పొగాకు, మత్తు పదార్థాలకు అలవాటు పడి బానిసలుగా మారుతున్నారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వారిపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు. పోలీసుల తనిఖీల్లో అధిక శాతం యువకులు, విద్యార్థులే పట్టుబడుతు ఒడడం గమనార్హం. వారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. శివారు ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకుంటున్నారు. కరీంనగర్‌కు చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మిత్రులతో కలిసి రెండేళ్లపాటు మాదకద్రవ్యాలు విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. మరి కొంతమంది మధ్యలోనే చదువును ఆపేసి వ్యాపారంలో దిగారు. వ్యాపారంతో వచ్చే లాభాలతో కొత్త ఫోన్లు, ఖరీదైన వాహనాలను కొనుగోలు చేస్తూ పది మందిలో పలుకుబడి ప్రదర్శిస్తున్నారు.

కూలీలే సరఫరాదారులుగా.....సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్నాటకకు చెందిన అనేక మంది కార్మికులు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పని చేయడానికి వస్తుంటారు. వారితోనే గంజాయి సరఫరా అవుతున్నట్లు తెలిసింది. రైలు, బస్సు మార్గాల్లో తరలిస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు నుంచి కూడా దిగుమతి అవుతోంది. మధ్యవర్తుల ద్వారా మాదకద్రవ్యాలను ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల సరిహద్దు ప్రాంతాల వద్ద నుంచి నేరుగా దిగుమతి చేసుకుంటున్నారు. నిత్యావసర సరకులు, కూరగాయలు, పండ్లతో కూడిన వాహనాలను సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీ చేయకుండానే వదిలేస్తున్నారని గుర్తించిన వ్యాపారులు ఆ దిశగా దందా కొనసాగిస్తున్నారు. కొందరు వ్యాపారులు స్థానిక అవసరాన్ని బట్టి సొంతంగా ద్విచక్ర వాహనాలను వినియోగిస్తున్నారు. కొన్ని దృష్టాంతాలు... రెండు రోజుల కిందట కరీంనగర్ నగరంలో ఏడుగురు యువకులు వేర్వేరు చోట్ల గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచి కొనుగోలు చేసి... పొట్లాల రూపంలో మార్చి ఇక్కడి యువతకు విక్రయిస్తున్నారు. పట్టుబడిన వారందరూ వేర్వేరు వృత్తులకు చెందిన 27 ఏళ్లలోపు యువకులే.రెండు నెలల కిందట కొత్తపల్లి మండలం శాంతినగర్‌లో కమిషనరేట్ పోలీసులు కట్టడి ముట్టడి నిర్వహించగా 2 కిలోలు పట్టుకున్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు..- ఎల్.సుబ్బారాయుడు, పోలీసు కమిషనర్‌నగరంలో కొందరు యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. సన్మార్గంలో నడిచి, బుద్ధిగా చదువుకోవాలి. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వండి. అక్రమ రవాణాకు చెక్ పెట్టేవిధంగా ప్రత్యేక దృష్టి సారించాం. గంజాయి రహిత జిల్లాగా చేసేందుకు ప్రణాళిక రచించాం. ఎవరైనా బానిసలుగా మారితే మాకు చెప్పండి. వారికి కౌన్సెలింగ్ ఇస్తాం.

# రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలని ఆందోళన

కరీంనగర్ : అర్హులైన పేదలకు రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఐఏఎస్ మాజీ అధికారి ఆకునూరి మురళి లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేపట్టారు. లబ్ధిదారుల ఎంపికలో శాసనసభ్యులు, కార్పొరేటర్లు డబ్బుల కోసం లబ్ధిదారులను పీక్కుతింటున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. ప్రస్తుతం ఇంటి జాగ ఉన్న వారికి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తామంటున్నారని, సలాకా, ఇసుక, తదితర సామగ్రి ధరలు చుక్కలనంటడంతో రూ.3 లక్షలు సరిపోవని, రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బహుజన కార్మిక సంఘం ప్రతినిధి కన్నం లక్ష్మణ్, బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్, ఎండీ రఫీ పాల్గొన్నారు.

# సాగులో భళా.. పారిశ్రామికంలో డీలా

కామారెడ్డి : రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల కన్నా ఉభయ జిల్లాలు విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో వెనుకంజలో ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే స్థూల ఉత్పత్తి తగ్గిపోగా.. తలసరి ఆదాయంలో కొంత పెరుగుదల ఉంది.నీటి పారుదల సౌకర్యం మెరుగవ్వడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మొత్తం మీద పలు రంగాల్లో కొంచెం మోదం.. మరికొంచెం ఖేదం అనేలా ఫలితాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2023 సామాజిక ఆర్థిక సర్వేలో అన్ని శాఖల వివరాలను పొందుపరిచింది. ఈ క్రమంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రగతి ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

తలసరి ఆదాయం తక్కువే

ఒక సంవత్సర కాలంలో ఒక వ్యక్తి ఆర్జించే ఆదాయాన్ని తలసరి ఆదాయం అంటారు. ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని బట్టి దీన్ని లెక్కిస్తారు. జిల్లా పరిధిలో ఏడాది మొత్తంలో జీఎస్‌డీపీని మొత్తం జనాభాతో భాగిస్తే వచ్చిన మొత్తాన్ని తలసరి ఆదాయంగా గణిస్తారు. గతం కంటే బాగున్నా.. ఇంకా మెరుగుపడాల్సి ఉంది. ముఖ్యంగా నిజామాబాద్‌తో పోలిస్తే కామారెడ్డి వాసుల తలసరి ఆదాయం భారీగా పెరగాల్సి ఉంది.

స్థూల జిల్లా జాతీయోత్పత్తి (జీడీడీపీ)

ఏ ప్రాంతమైనా అభివృద్ధికి కొలమానంగా స్థూల జిల్లా జాతీయ ఉ



త్పత్తి(జీడీడీపీ)ని పేర్కొంటారు. ఏడాది కాలంలో ఆ జిల్లాలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తుసేవలు, కొనుగోలు సేవలను జీడీడీపీగా పరిగణిస్తుంటారు. ఆర్థిక వ్యవస్థకు ఇది సూచిక. వినిమయం,పెట్టుబడి, ప్రభుత్వ వ్యయంతో పాటు ఎగుమతులు, దిగుమతుల మధ్య తేడా తదితర వాటిని లెక్కలోకి తీసుకుంటారు. భవిష్యత్తు ప్రణాళికలను నిర్ణయించడానికి జీడీడీపీయే కొలమానం. రాష్ట్రంలో నిజామాబాద్ ఏడో స్థానంలో ఉంది. రంగారెడ్డి ప్రథమ, హైదరాబాద్ ద్వితీయ స్థానంలో ఉన్నాయి.

ప్రగతి కొంతేమూడేళ్లుగా ఉభయ జిల్లాల స్థూల జిల్లా జాతీయోత్పత్తి ధరలకు అనుగుణంగా పెరగడం లేదు. ప్రధానంగా పరిశ్రమల స్థాపన అంతంత మాత్రంగానే ఉంది. 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు అరకొర పరిశ్రమల స్థాపనే జరిగింది. ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలున్నా.. ఆ దిశగా అడుగులు పడటం లేదు. స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వలసలు కొనసాగుతున్నాయి. చిన్న, సూక్ష్మ పరిశ్రమల స్థాపనలో ఆశించిన ప్రగతి కానరావడం లేదు. పూర్తిగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడటంతో తలసరిలో స్వల్ప వృద్ధి మాత్రమే కనిపిస్తోంది.

తగ్గిన ఉపాధి పనులు కొవిడ్ సమయంలో ఉభయ జిల్లాలు ఉపాధి పనులు చేపట్టడంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయి. గతేడాది కామారెడ్డి ప్రగతి అంతంత మాత్రంగానే ఉంది. నిజామాబాద్‌తో పోల్చితే మరింత పడిపోయింది. నిర్దేశించిన లక్ష్యం మేర కూలీలకు పనిదినాలు కల్పించలేని స్థితికి చేరింది.

పచ్చదనం పెరగాలి

కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో అడవుల విస్తీర్ణం క్రమేపీ పెరుగుతోంది. ములుగు జిల్లా 71.8 శాతంతో ప్రథమ స్థానంలో ఉంది. రాష్ట్ర సగటు 24 శాతం కాగా కామారెడ్డిలో 23.70, నిజామాబాద్‌లో 20.79 శాతం మేర అడవులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

వ్యవసాయంలో వృద్ధి


మూడేళ్ల నుంచి జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువులు, కుంటలతో పాటు జలాశయాల్లోకి సమృద్ధిగా నీరు చేరింది. భూగర్భజలాల పెరిగి సాగునీటి వసతులు మెరుగయ్యాయి. సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. వాణిజ్య పంటలు తగ్గి ఆహార పంటల సాగు పెరిగింది.

ఎడాపెడా ఎరువుల వినియోగం

పంటల సాగులో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంది. అధికారుల సూచనలు పాటించకుండా అవసరానికి మించి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రాష్ట్ర సగటు ఎకరానికి 177 కిలోలు ఉంటే నిజామాబాద్‌లో అంతకంటే ఎక్కువే వాడుతున్నారు. కామారెడ్డిలో కొంత తక్కువగానే ఉన్నప్పటికీ అవసరానికి మించి వినియోగిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

# ఎన్‌క్యూఏఎస్‌కు మెండోరా పీహెచ్‌సీ ఎంపిక


కామారెడ్డి :మెండోరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్‌క్యూఏఎస్(నేషనల్ క్వాలిటీ అస్సురెన్స్ స్టాండర్డ్స్)కు ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏటా రూ.లక్ష చొప్పున మూడేళ్ల పాటు నిధులు రానున్నాయి. ఇటీవల కేంద్ర వైద్యాధికారుల బృందం జిల్లాలో పలు పీహెచ్‌సీలను పరిశీలించింది. అందులో భాగంగా మెండోరా పీహెచ్‌సీని సందర్శించింది. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, ప్రభుత్వం కల్పిస్తున్న



ఆరోగ్య పథకాలను రోగులకు ఎలా చేరవేస్తున్నారో వైద్యాధికారులు చూశారు. అన్ని అంశాల్లో మెండోరా మెరుగైన ప్రతిభ చాటడంతో ఎంపిక చేశారు. మూడేళ్ల తర్వాత వైద్య సేవలు ఇదే స్థాయిలో అందిస్తే మరో మూడేళ్లు పెంచే అవకాశం ఉంది. గతంలో కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎంపికై మూడేళ్ల పాటు నిధులు పొందాయి. జిల్లా ఉప వైద్యాధికారి రమేశ్ రాథోడ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మెండోరా పీహెచ్‌సీ బృందం హర్షం వ్యక్తం చేసింది.

గరుడ వార్త





# టీడీపీ మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య వైఎస్సార్ సీపీలో చేరిక

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలకు మరో తొమ్మిదినెలలు గడువు ఉండగానే రాజకీయం వేడెక్కుతోంది. రాష్ట్రంలో ఈ ధపా ఎన్నికల్లో 175ను టార్గెట్ చేస్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారు. ఇటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సహా స్థానిక ప్రజా ప్రతినిధులను కూడా ప్రజల్లో ఉంచుతూ సకాలంలో సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఆయన పాలనకు ఆకర్షితులై పలువురు రాజకీయ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.

**రాజాంలో కొత్త జోష్ :** రాజాం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఖాతాలో ఉంది. 2019 ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కోండ్రు మురళీమోహన్ భారీ ఓట్ల తేడాతో కంబాల జోగులు చేతిలో ఓడిపోయారు. రెండేళ్లపాటు కోండ్రు నియోజకవర్గానికి ముఖంచాటేశారు. తాజాగా ఏడాదిన్నర కిందట నుంచి తిరుగుతున్న ఆయనకు రేగిడి, రాజాం, వంగర మండలాల్లో తమ పార్టీ ప్రధాన నేతల నుంచే వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో రాజాంకు చెందిన టీడీపీ సీనియర్ నేత, రెండు పర్యాయాలు పాలకొండ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన తలే భద్రయ్య, తన కుమారుడు డాక్టర్ రాజేష్ వైఎస్సార్ సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారి వెంట రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు. దీంతో రాజాం నియోజకవర్గం వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో చేరడం ఖాయమన్న విజయసంకేతం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## జగ్గంపేట ఎమ్మెల్యే కుమార్తె వివాహం.. నూతన వధువరులకు సీఎం జగన్ ఆశీర్వాదం



కాకినాడ: జగ్గంపేట నియోజకవర్గంలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఇర్రిపాకలోని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నివాసానికి వెళ్లిన సీఎం జగన్.. నూతన వధూవరులు అన్నపూర్ణ, సాయి ఆదర్శ్ లను ఆశీర్వదించారు. అంతకు ముందు ఇర్రిపాకలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద మంత్రులు,ఎమ్మెల్యేలు సీఎం జగన్‌కు సాదర స్వాగతం పలికారు.

# టికెట్ పంచాయతీ





# మైలవరంలో మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే.....?

విజయవాడ : క్రిష్ణా జిల్లా రాజకీయాలు వైసీపీని ఉక్కిరి బిక్కిరి చేసేలా ఉన్నాయి. నిన్న గన్నవరం నేడు మైలవరం రేపు మరోటి అన్నట్లుగా రాజకీయ కాక అలా సలసల మండుతూనే ఉంది. గన్నవరంలో వైసీపీ కీలక నేత యార్లగడ్డ వెంకటరావు పార్టీని గుడ్ బై కొట్టేసి టీడీపీలో చేరిపోయారు. ఆయనకు ఆ పార్టీ ఇంచార్జిగా నియమించింది. ఇక గన్నవరంలో వల్లభనేని వంశీకి లైన్ క్లియర్ అయింది అని అంటున్నారు. ఇదే నియోజకవర్గంలో ఉనన్ మరో సీనియర్ నేత దుట్టా రామచంద్రరావుకు హై కమాండ్ గట్టి హామీ ఇచ్చింది అని కూడా చర్చించుకుంటున్నారు. సో గన్నవరంలో వైసీపీ కి బిగ్ రిలీఫ్ దొరికింది అనుకునేలోగానే ఇపుడు మైలవరంలో మంటలు రేగుతున్నాయి. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత క్రిష్ణ ప్రసాద్ వర్సెస్ మంత్రి జోగి రమేష్ అన్నట్లుగా చాలా కాలంగా రాజకీయం సాగుతోంది. 2019 ఎన్నికల్లో పెడన నుంచి ఎమ్మెల్యేగా నెగ్గిన జోగి రమేష్ సొంత ఊరు మైలవరంలో ఉంది. నిజానికి ఆయన 2009లో మొదటి సారి కాంగ్రెస్ తరఫున పెడన నుంచి గెలిచారు. 2014లో ఓడిపోయారు. ఇక 2024 ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆయన మైలవరం సీటుని సేఫెస్ట్ గా చూస్తున్నారు. మైలవరంలో గతంలో కాంగ్రెస్ కి టీడీపీకి సమాన బలం ఉంది. ఇక్కడ నుంచి రెండు సార్లు దేవినేని ఉమా మహేశ్వరరావు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో ఆయన ఓటమి పాలు అయ్యారు. ఇక 2019లో వసంత క్రిష్ణ ప్రసాద్ వైసీపీలో చేరి ఈ సీటు దక్కించుకున్నారు. గెలిచారు. ఆయన 2024లో కూడా ఇదే సీటు నుంచి పోటీ చేయాలని చూస్తున్నారు. అయితే మంత్రి జోగి రమేష్ నియోజకవర్గం రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారు అని చాలా కాలం క్రితమే ఆయన హై కమాండ్ కి ఫిర్యాదు చేయడం ఒక దశలో హట్ కామెంట్స్ చేయడంతో హై కమాండ్ ఆయన్ని పిలిపించి మాట్లాడింది. మంత్రి జోగి రమేష్ కి కూడా నచ్చచెప్పి ఒకరి నియోజకవర్గాలలో మరొకరు జోక్యం చేసుకోవద్దు అని సూచించింది. అప్పట్లో గడప గడప కార్యక్రమాన్ని కూడా వసంత క్రిష్ణ ప్రసాద్ చేయకుండా అలిగి దూరంగా ఉండిపోయారు. హై కమాండ్ మాటతో ఆయన మళ్లీ యాక్టివ్ అయ్యారు. ఇదిలా ఉంటే ఈ మధ్య ఒక నలభై అయిదు రోజుల పాటు వసంత అమెరికా టూర్ వెళ్లారు. దాంతో జోగి రమేష్ వర్గం మైలవరంలో హల్ చల్ చేయడమే కాకుండా ఈసారి టికెట్ జోగి రమేష్ కే అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తూ వచ్చింది. అమెరికా నుంచి తిరిగి వచ్చిన వసంత క్రిష్ణ ప్రసాద్ దీని మీద మండిపడుతున్నారని అంటున్నారు. పార్టీలో కొందరు వర్గ పోరుని కోరి పెంచి పోషిస్తున్నారు అని తాను మెత్తగా ఉంటాను అనుకుంటే పొరపాటేనని వసంత చేస్తున్న హాట్ కామెంట్స్ తో మైలవరం వైసీపీ రాజకీయం మళ్లీ వేడెక్కింది అంటున్నారు. తన సీటును లాగేద్దామని చూస్తున్న వారికి ఆ చాన్స్ ఇవ్వనని ఆయన అంటున్నట్లుగా కూడా చెబుతున్నారు. ఒక విధంగా డైరెక్ట్ ఫైట్ కి వసంత్ రెడీ అయిపోయారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే మైలవరంలో జరుగుతున్నది అంతా హై కమాండ్ కి తెలుసు అని వేరేగా చెప్పాల్సింది లేదని ఆయన అంటున్నట్లుగా కూడా ప్రచారంలో ఉంది. మరి మైలవరం టికెట్ ఎవరికి ఇస్తారు అన్నది చర్చకు వస్తోంది. బీసీ అయిన మంత్రి జోగి రమేష్ కే మైలవరం టికెట్ ఇస్తారా అన్న డౌట్స్ వస్తున్నాయి. జోగి రమేష్ కాంగ్రెస్ నుంచి వైసీపీ లోకి వచ్చిన వారు. జగన్ కి అత్యంత సన్నిహితులు. ఇక ఆయన పెడన నియోజకవర్గంలో పూర్తి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు అని అంటున్నారు. దాంతో ఆయనను మైలవరం షిఫ్ట్ చేస్తారని అంటున్నారు. మరి ఆయనకు మైలవరం ఇస్తే వసంత ఏ రూట్ తీసుకుంటారు అన్న చర్చ కూడా ముందుకు వస్తోంది. అయితే ఆయన రాజకీయాల నుంచి తప్పుకుంటారా లేక తెలుగుదేశం వైపు చూస్తారా అన్నది కూడా చర్చనీయాంశం అవుతోంది. అయితే టికెట్ విషయంలో జగన్ నుంచి కచ్చితమైన హామీ ఉందని 2024లో వైసీపీ నుంచి పోటీ చేసేది గ్లిచేది వసంత క్రిష్ణ ప్రసాద్ మాత్రమే అని ఆయన వర్గం ధీమాగా చెబుతోంది. చూడాలి మరి మైలవరం మంటలు ఎప్పటికి చల్లారుతాయో.




రాయ్‌పుర్ : రక్షాబంధన్ సందర్భంగా ఓ అక్క కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్న తన తమ్ముడికి రాఖీ కట్టింది. అంతే కాదు.. అతడు కోలుకునేందుకు తన వంతుగా కిడ్నీ దానం చేస్తున్నట్లు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పుర్ నగరానికి చెందిన ఓం ప్రకాశ్ ధన్‌గర్‌కు గతేడాది మేలో కిడ్నీ దెబ్బతినింది. దాంతో తరచూ డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక కిడ్నీ 80%, మరో కిడ్నీ 90% దాకా క్షీణించినట్లు గుర్తించిన వైద్యులు వెంటనే కిడ్నీ మార్పిడి చేయించుకోవాలని ఆయనకు సూచించారు. లేని పక్షంలో ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. దాంతో ఓం ప్రకాశ్ కుటుంబ సభ్యులు గుజరాత్ రాష్ట్రం నడియాడ్‌లోని ఓ ఆస్పత్రిని సంప్రదించారు. అక్కడి వైద్యులు సైతం కిడ్నీ మార్పిడి తప్పనిసరి అని తేల్చి చెప్పారు. ఎవరైనా దాతలు ఉంటే ఆపరేషన్‌కు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ విషయం ఓం ప్రకాశ్.. అక్క సుశీలాబాయ్ పటేల్ దృష్టికి వచ్చింది. వెంటనే ఆమె తన తమ్ముడికి కిడ్నీ దానం ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. వైద్యులు ఆమెకు అవసరమైన వైద్య పరీక్షలన్నీ నిర్వహించారు. అనంతరం దాత కిడ్నీ.. మార్పిడికి సరిపోతుందని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 3న కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరగబోతోంది. ప్రస్తుతం సుశీలాబాయ్, ఓం ప్రకాశ్ గుజరాత్‌లోని ఆస్పత్రిలో ఉన్నారు. నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా సుశీల తన సోదరుడికి రాఖీ కట్టి.. నిండు నూరేళ్లు క్షేమంగా ఉండాలని దీవించింది. తమ్ముడు ఓం ప్రకాశ్ అంటే తనకు ఎంతో ప్రేమ అని.. అందుకే కిడ్నీ దానానికి సిద్ధపడ్డానని సుశీల తెలిపింది.




వంటగ్యాస్ సిలిండర్ ధర తగ్గిన నేపథ్యంలో ఇప్పుడు అందరి ఆశలు పెట్రోల్, డీజిల్‌పైకి మళ్లాయి. గ్యాస్ ధర తగ్గింపుతో ద్రవ్యోల్బణం దిగిరావొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి వాహన ఇంధన ధరల కోత కూడా తోడైతే అన్ని నిత్యావసరాల ధరలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. సామాన్యులు కూడా ఇదే ఆశిస్తున్నారు. అయితే, ఇవన్నీ నిజమయ్యే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సంస్థ సిటీ గ్రూప్ అంచనా వేసింది. రాబోయే పండగల సీజన్‌తో పాటు వరుస ఎన్నికల నేపథ్యంలో కేంద్రం పెట్రో ధరల తగ్గింపుపై సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని సిటీ గ్రూప్ అంచనా వేసింది. వంట గ్యాస్ ధర తగ్గించాలన్న కేంద్రం నిర్ణయంతో ద్రవ్యోల్బణం దాదాపు 30 బేసిస్ పాయింట్లు తగ్గే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక వేత్తలు సమీరన్ చక్రవర్తి, బకార్ ఎం.జైదీ తెలిపారు. ఇటీవల టమాటాల ధరలు దిగివచ్చిన నేపథ్యంలో సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం దిగువకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. జులైలో 15 నెలల గరిష్ఠానికి చేరిన నిత్యావసరాల ధరలు తగ్గుముఖం పట్టేందుకు కేంద్రం అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆర్థిక నిపుణులు చెప్పారు. తాజాగా గ్యాస్ ధర తగ్గించడం అందులో భాగమేనని వివరించారు. మరోవైపు ఇప్పటికే బియ్యం, గోధుమలు, ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ చర్యలకు పెట్రో ధరల తగ్గింపు కూడా జత అయితే ద్రవ్యోల్బణం దిగొస్తుందని ఆశిస్తున్నారు. ఈ ఏడాది చివరలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, మిజోరం సహా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2024లో సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిత్యావసరాల ధరల తగ్గుదల దిశగా కేంద్రం మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత ఏడాదిగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో తీవ్ర ఒడుదొడుకులు ఉన్నాయి. మన దగ్గర మాత్రం దాదాపు సంవత్సరం నుంచి పెట్రో ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం ద్వారా ధరల్ని సవరించే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. హైదరాబాద్‌లో బుధవారం లీటర్ పెట్రోల్ ధర రూ.109.66గా, డీజిల్ ధర రూ.97.82గా ఉంది. విజయవాడలో ఈ ధరలు వరుసగా.. రూ.111.76, రూ.99.51గా ఉన్నాయి.




# గ్యాస్ ధర తగ్గింపు ఎన్నికల డ్రామానే..

విజయవాడ: అధికధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సీపీఎంసమరభేరి ప్రచారయాత్ర చేస్తోంది. ఈ సందర్భంగా బుధవారం విజయవాడలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ గ్యాస్ బండ ధర తగ్గింపు ఎన్నికల డ్రామా అని, పెరిగిన ధరలు తగ్గించకుండా మోదీ జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపుతో సీఎం జగన్ జనాలకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నారన్నారు. సోలార్, విండ్, ఎత్తిపోతల విధానాలతో సబ్సిడీపై ప్రజలకు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. యూనిట్ ఒక రూపాయికే కరెంటు ఇవ్వొచ్చునని అన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని.. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రత్యేక హోదా గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. బీజేపీ మతోన్మాదాన్ని చంద్రబాబు వ్యతిరేకిస్తున్నారా? లేక మద్దతు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. జగన్, చంద్రబాబులు ప్రధాని మోదీకి వత్తాసు పలుకుతున్నారని, ఏపీకి బీజేపీ చేసిన ద్రోహంపై వారు ఎందుకు మాట్లాడటం లేదని శ్రీనివాసరావు నిలదీశారు.

## లోకేశ్‌కు వినతి పత్రం అందజేసిన లక్కవరం మత్స్యకారులు



ఏలూరు: టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర పశ్చిమగోదావరి జిల్లాలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లిలో లక్కవరం గ్రామానికి చెందిన మత్స్యకారులు లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. టీడీపీ పాలనలో గ్రామాల్లోని చెరువులను వేలం వేయకుండా మత్స్యకార సంఘాలకు ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం బహిరంగ వేలంతో తమకు చెరువులు ఇవ్వకుండా అధికారపార్టీకి చెందిన వారికి కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై నిలదీశామనే కక్షతో స్థానిక ఎమ్మెల్యే తాము మత్స్యకారులం కాదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని మత్స్యకారులు వాపోయారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ... మత్స్యకారుల జీవనోపాధికి ఉపయోగపడే చెరువులను కూడా జగన్ వైసీపీ దొంగలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. జగన్ తమ పార్టీ వారికే చెరువులు ఇవ్వాలనే చేయడం దుర్మార్గమన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మత్స్యకారుల జీవనోపాధికి గొడ్డలివేటుగా ఉన్న జీఓ 217ను రద్దు చేస్తామని తెలిపారు. గతంలో మాదిరి మత్స్యకార సొసైటీలకే చేపల చెరువులను కేటాయిస్తామన్నారు.

వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారికి చంద్రన్నబీమాలో పరిహారం అందిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.




# ఇది నా జీవితం..ఆ టైంలో విపరీతమైన ట్రోల్స్!

ముందు తమిళ సినిమాల్లో నటించి అక్కడ నేషనల్ అవార్డు కూడా అందుకున్న ప్రియమణి ఆ తర్వాత తెలుగు తెరకు పరిచయమై ఎన్నో సినిమాల్లో నటించింది. తెలుగులో తనకు స్టార్ ఇమేజ్ రాకపోయినా సరే తనకంటూ ఒక సెపరేట్ ఇమేజ్ ఏర్పరచుకుంది ప్రియమణి. ఎన్.టి.ఆర్ బాలకృష్ణ వెంకటేష్ నాగార్జున లాంటి స్టార్స్ తో నటించిన ప్రియమణి నటనలో తన మార్క్ చూపిస్తూ వచ్చింది. పెళ్లి తర్వాత కూడా కెరీర్ గ్రాఫ్ ఎక్కడ పడిపోకుండా చూసుకుంటూ వస్తుంది ప్రియమణి. అయితే లేటెస్ట్ గా తన పై వచ్చిన బాడీ షేమింగ్ కామెంట్స్ ట్రోల్స్ పై స్పందించింది ప్రియమణి. బాడీ షేమింగ్ ట్రోల్స్ ని తాను పెద్దగా పట్టించుకోలేదని తన కలర్ లుక్స్ పై చాలా సార్లు ట్రోల్స్ చేశారని కాకపోతే వాటిని తాను పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. అయితే తను ముస్తఫా ని ప్రేమించి పెళ్లాడినప్పుడు మాత్రం నెటిజన్ల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొన్నానని అన్నారు ప్రియమణి.



తన ఎంగేజ్మెంట్ ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసినప్పుడు నువ్వు ఓ ముస్లిం వ్యక్తిని ఎందుకు పెళ్లిచేసుకున్నావ్ అంటూ చాలా దారుణంగా కామెంట్స్ చేశారని.. అయితే అలా కామెంట్ చేసిన వారందరికీ తన ఆన్సర్ ఒక్కటే అంటుంది ప్రియమణి. ఇది తన జీవితం.. ఎవరితో జీవితాన్ని పంచుకోవాలి అన్నది పూర్తిగా తన ఇష్టపూర్వకంగా చేస్తుందట. ట్రోల్స్ కు అనవసరమన అటెన్షన్ ఇచ్చి వాటి వల్ల తర్వాత ఇబ్బంది పడటం తనకు ఇష్టం లేదని అంటుంది ప్రియమణి. అసలు అలాంటి ట్రోల్స్ ని తాను పట్టించుకోనని తన పని తాను చేసుకుంటూ వెళ్తానని అంటుంది అమ్మడు. ఆన్ లైన్ ట్రోలింగ్ పై ప్రియమణి చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. కన్నడ అమ్మాయే అయినా తెలుగు తమిళ మలయాళ హిందీ భాషల్లో సినిమాలు చేసింది ప్రియమణి. హీరోయిన్ గా ఆఫర్లు లేని టైం లో ఎలాంటి పాత్ర వచ్చినా చేస్తూ కెరీర్ సాగిస్తుంది ప్రియమణి. రీసెంట్ గా చాలా సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేస్తూ వస్తున్న ప్రియమణి నెగిటివ్ రోల్స్ కి సై అనేస్తుంది. కస్టడీ సినిమాలో ఆమె అలాంటి పాత్రతోనే మెప్పించింది. ప్రస్తుతం అట్లీ డైరెక్షన్ లో షారుఖ్ ఖాన్ నటిస్తున్న జవాన్ సినిమాలో కూడా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది ప్రియమణి. తనకు ఇచ్చిన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేయగల నటీమణుల్లో ప్రియమణి ఒకరు. అందుకే ఆమెకు ఇప్పటికీ తనకు తగిన పాత్రలు వస్తున్నాయి.

# కొత్త జంటల లవ్ కెమిస్ట్రీ కాసులు కురిపించింది

నాయకానాయికల మధ్య లవ్ కెమిస్ట్రీ సరిగా కుదిరితే.. మంచి ప్రేమకథ రొమాన్స్ కామెడీ సమకుదిరితే ఒక సాధారణ బడ్జెట్ సినిమా అయినా విజయం సాధిండం కష్టమేమీ కాదని నిరూపణ అవుతోంది. ఇటీవలి కాలంలో బాలీవుడ్ కష్ట కాలంలో ఉన్నప్పుడు వచ్చిన ఓ రెండు రొమాంటిక్ కామెడీ చిత్రాలకు దక్కిన ఆదరణ ఇందుకు ఎగ్జాంపుల్. ఇవి రెండూ చక్కని విజయాలు అందుకున్నాయి. రణబీర్- శ్రద్ధా కపూర్ జంటగా లవ్ రంజన్ తెరకెక్కించిన 'తు ఝూతి మైన్ మక్కార్' సైలెంట్ హిట్ కొట్టింది. ఈ సినిమా పరిమిత బడ్జెట్ తో తెరకెక్కి అందమైన మ్యూజికల్ హిట్ సినిమాగా నిలిచింది. ఈ చిత్రంలో రణబీర్ – శ్రద్ధా నడుమ రొమాన్స్ కెమిస్ట్రీ ఒక రేంజులో వర్కవుటవ్వడమే ఈ విజయానికి కారణం. చకపుల్ గోల్స్ అంటూ రణబీర్- శ్రద్ధా జంట అల్లరి యూత్ కి బాగా నచ్చింది. ఈ టైటిల్ లానే ఈ చిత్రం ప్రేక్షకులకు చాలా సరదాగా ట్రీటివ్వటమే కాకుండా



2023లో ప్రేమ శృంగారంపై సరికొత్త నిర్వచనం చెప్పిన సినిమాగా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు విక్కీ కౌశల్ – సారా అలీ ఖాన్ జంటగా నటించిన తాజా చిత్రం 'జరా హాట్కే జరా బచ్కే' టైటిల్ ఎంత ఛమత్కారంగా ఉందో సినిమా కూడా అంతే క్లీన్ హిట్ సాధించింది. పరిమిత బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా 85 కోట్ల నికర వసూళ్లతో ప్రయోజనకరమైన ఫలితాన్ని అందుకుంది. వందల కోట్లతో తెరకెక్కిస్తున్న అగ్ర హీరోల సినిమాల వసూళ్లతో పోలిస్తే చాలా ఉత్తమం అని ఈ రెండు సినిమాలు నిరూపించాయి. ఇకపోతే జరా హాట్కే జరా బచ్చే లో కొత్త జంట లవ్ కెమిస్ట్రీ ఒక రేంజులో వర్కవుటైందని తాజాగా రివీలైన ఫోటో చెబుతోంది. విక్కీ- సారా జంట నడుమ రొమాన్స్ హత్తుకునే లెవల్లో వర్కవుటైందని ఈ ఫోటో చెప్పకనే చెబుతోంది. చిన్న మధ్యతరహా బడ్జెట్ సినిమాలు కూడా బాగా ఆడినప్పుడే పరిశ్రమకు మనుగడ ఉంటుంది. జరా హాట్కే జరా బచ్కే మీడియం బడ్జెట్ తో తెరకెక్కిన రియల్ రొమాంటిక్ కామెడీ. ఈ చిత్రం సాధించిన విజయం సినీ పరిశ్రమకు పెద్ద ఊపునిచ్చింది. అసాధారణ బడ్జెట్లతో భారీ పాన్ ఇండియా సినిమాలు తీస్తేనే జనం థియేటర్లకు రారు. మంచి కంటెంట్ కాన్సెప్ట్ ఉన్న మధ్యస్థ బడ్జెట్ సినిమాల్ని థియేటర్లలో ఆదరిస్తారనడానికి ఈ సినిమాలు ఉదాహరణ. ఈ ఏడాది లో 'తు ఝూతి మైన్ మక్కార్' – 'జరా హాట్కే జరా బచ్కే' చిత్రాలు సైలెంట్ హిట్లు కొట్టడం బాలీవుడ్ కి కొంతలో కొంత ఊరట. చాలా చిన్న సినిమాలు ఓటీటీలపై ఆధారపడి తీస్తున్నారు. అందుకు భిన్నంగా మంచి కంటెంట్ ఉన్న సినిమాల్ని పెద్ద తెరపైనే రిలీజ్ చేస్తే చక్కని రిజల్ట్ దక్కుతుందని కూడా నిరూపణ అవుతోంది.

# ప్లాస్టిక్ బార్బీ డాల్స్.. పడిందిగా బిగ్ పంచ్!



బలమైన శాశ్వతమైన స్నేహానుబంధాన్ని కొనసాగిస్తున్న ఈ హాట్ పింక్ బార్బీ లు ఎవరై ఉంటారు? గెస్ .. హూ దే ఆర్? వీళు ఎవరు? ఇందులో ఒకరు దిశా పటనీ.. మరొకరు మౌని రాయ్. షోకేస్ నుంచి ఊడిపడిన అందమైన బార్బీ బొమ్మల్లా దిశా–మౌని ఎంతో క్యూట్ గా కనిపిస్తున్నారు కదూ? ఈ బొమ్మలు ఎంత ఖరీదైనవి అయినా కొనేందు కు కోటీశ్వరులు వెంటపడినా ఇవి చిక్కని దొరకని విలాసవంతమైన బార్బీలు. సెక్సీ పింక్ షార్ట్ డ్రెస్ లో దిశా – మౌని జతగా కెమెరాకు ఫోజులివ్వగా ఈ ఫోటో అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. స్ట్రాపీ డ్రెస్ లో టై–అప్ డీటెయిలింగ్ నెక్ లైన్ కి తగ్గట్టుగా బ్యూటిఫుల్ డిజైనర్ హ్యాండ్ బ్యాగ్ తో దిశా స్టైలింగ్ ని పూర్తి చేయగా... మౌని స్ట్రాపీ హీల్స్ తో స్పెషల్ గా కనిపించింది. అలా అందంగా కెమెరా కు పోజులిస్తూ అంతే బ్యూటిఫుల్ గా ఆ ఇద్దరూ స్మైలిస్తున్నారు. ఈ ఫోటోల కు నెటిజనుల నుండి అనేక స్పందనలు వచ్చాయి. వీటి లో కొన్ని పాజిటివ్.. చాలా నెగెటివ్ కామెట్లు ఉన్నాయి. కొందరు వారి స్నేహానుబంధాన్ని ప్రశంసించగా.. మరికొందరు 'ప్లాస్టిక్ బేబీస్' అని కూడా కామెంట్ చేసారు. ఒక నెటిజన్ 'ప్లాస్టిక్ బార్బీ డాల్స్' అని రాశారు. మరొకరు.. మౌనీ నా ఆల్ టైమ్ ఫేవరెట్ ప్లాస్టిక్ క్వీన్... కొన్నిసార్లు తీవ్రమైన వేడి వాతావరణం లో ఆమె శరీర భాగాలు కరిగిపోవచ్చని భయపడతాను! అంటూ ఘాటుగా వ్యాఖ్యానించాడు. ఇంతకీ ఆమె(మౌని)తో ఉన్న ఇతర వస్తువు ఎవరు? కచ్చితంగా మౌని వలె అదే డాక్టర్ తో కత్తి కింద పదును (సర్జరీని) చూసింది.. అంటూ ఆ ఇద్దరినీ ప్లాస్టిక్ సర్జరీల క్వీన్స్ అని పరోక్షంగా విమర్శించాడో నెటిజన్. అమ్మాయిలు అందాన్ని కోల్పోయారు... నగ్నత్వం ఆధునికత్వం! అంటూ మరొకరు నిరాశగా వ్యాఖ్యానించారు.

బార్బీ అందాలు మైమరిపిస్తున్నాయని పలువురు నెటిజనులు పాజిటివ్ గా వ్యాఖ్యానించారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే దిశా పటాని చివరిగా ఏక్ విలన్ రిటర్న్స్ లో కనిపించింది. ప్రస్తుతం ప్రాజెక్ట్ K లో ప్రభాస్- దీపికా పదుకొనేతో కలిసి పని చేస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రా సరసన 'యోధ'లోను నటిస్తోంది. సిరుత్తై శివ దర్శకత్వం వహిస్తున్న సూర్య 42తో దిశా తమిళం లోకి అడుగుపెట్టనుంది. బ్రహ్మాస్త్ర లో చివరి సారిగా కనిపించిన మౌని.. తదుపరి పాలక్ తివారీ- సన్నీ సింగ్ లతో కలిసి 'ది వర్జిన్ ట్రీ'లో కనిపించనుంది.

# గుడ్ ఫ్రెండ్స్ గ్యాప్ తర్వాత కలిస్తే అంతేనా?





విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న రిలేషన్ గురించి రకరకాల పుకార్లు షికార్ చేస్తున్న సంగతి తెలిసిందే. నిజానికి ఆ ఇద్దరూ మంచి స్నేహితులు మాత్రమేనని ప్రకటించినా దానిని అభిమానులు పట్టించుకునే మూడ్ లో లేరు. ఈ అందమైన జంట రహస్య డేట్ లకు వెళుతోందంటూ ఒక సెక్షన్ అభిమానులు ప్రచారం చేస్తున్నారు. తాజాగా మరోసారి డేట్ ను ఆస్వాధించిన ఈ జంటపై రకరకాలుగా పుకార్లు షికార్ చేస్తున్నాయి. ఆ ఇద్దరు తారలు ఇటీవల నగరంలో డేట్ ని ఆనందిస్తున్న ఫోటోలు కనిపించడంతో మరోసారి ప్రచారం ఊపందుకుంది. అయితే రష్మిక- విజయ్ కుటుంబ సభ్యులు స్నేహితులు కూడా ఈ పార్టీలో ఉన్నారు. దీంతో ఇది కేవలం కుటుంబ సభ్యులతో సెలబ్రేషన్ అని అర్థం చేసుకోవాలి. రష్మిక- విజయ్ నడుమ చక్కని స్నేహ సంబంధాలు ఉన్న మాట వాస్తవం. విజయ్ కుటుంబంతో కలిసి పోయి రష్మిక ఎంతో డిగ్నిఫైడ్ గా నడుచుకుంటారు. ఇప్పుడు కూడా రష్మిక – విజయ్ ఒకరికొకరు తమ స్నేహితులతో కొంత నాణ్యమైన సమయాన్ని ఆస్వాధిస్తున్న వీడియో ఇంటర్నెట్ లో హల్ చల్ చేస్తోంది. వీడియోలో విజయ్ అందరితో చాట్ చేస్తున్నప్పుడు రష్మిక మరొక మహిళ డ్యాన్స్ చేస్తూ అల్లరిగా కనిపించింది.

రష్మిక – విజయ్ తొలిసారిగా 2018లో విడుదలైన గీత గోవిందం చిత్రంలో నటించారు. ఈ చిత్రం షూటింగ్ సమయంలో ఇద్దరూ ప్రేమలో పడ్డారని ప్రచారమైంది. 2019లో ఇద్దరూ డియర్ కామ్రేడ్‌లో మరోసారి స్క్రీన్ ను షేర్ చేసుకున్నారు. తరువాత 2022లో రష్మిక- విజయ్ ఒకరికొకరు నెలల తేడాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టారు. అదే క్రమంలో ఈ జంటపై రకరకాల పుకార్లు షికార్ చేసాయి. కానీ తమ మధ్య ఉన్నది మంచి స్నేహం మాత్రమేనని ఆ ఇద్దరూ క్లారిటీనిచ్చారు. వాస్తవానికి ఇద్దరూ కలిసి 2023 నూతన సంవత్సరాన్ని దుబాయ్ లో సెలబ్రేట్ చేసుకున్నారు. ఫిబ్రవరిలో దుబాయ్ లో విజయ్ అతడి కుటుంబంతో కలిసి వెకేషన్ ఆస్వాధిస్తుండగా అక్కడ రష్మిక మందన స్పెషల్ గా కనిపించింది. ప్రతిసారీ కుటుంబంతో కలిసి సెలబ్రేషన్స్ లో రష్మిక కనిపిస్తోంది. అయితే మీడియా ప్రచారం వేరొకలా టర్న్ తీసుకుంటోంది.

# భగవంత్ కేసరి.. శ్రీ లీల సర్ ప్రైజ్..!

నందమూరి బాలకృష్ణ అనీల్ రావిపుడి క్రేజీ కాంబినేషన్ లో వస్తున్న సినిమా భగవంత్ కేసరి. ఈ సినిమాను షైన్ స్క్రీన్ బ్యానర్ లో హరీష్ పెద్ది సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తుండగా రీసెంట్ గా రిలీజైన భగవంత్ కేసరి టీజర్ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. సినిమాలో బాలయ్య లుక్ క్యారెక్టరైజేషన్ అంతా కొత్తగా ఉంటాయని తెలుస్తుంది. ముఖ్యంగా భగవంత్ కేసరి సినిమాలో శ్రీ లీల పాత్ర మెయిన్ హైలెట్ గా నిలుస్తుందని అంటున్నారు. పెళ్లి సందడి ధమాకా ఈ రెండు సినిమాలతో శ్రీ లీల తెలుగులో సూపర్ క్రేజ్ తెచ్చుకోగా ఆమె డ్యాన్స్ చలాకీతనం ఆడియన్స్ కి తెగ నచ్చేసింది. అదే ఆమెకు వరుస



అవకాశాలు వచ్చేలా చేస్తుంది. టాలీవుడ్ లో ఇప్పుడు అమ్మడు వరుస స్టార్ ఛాన్స్ లు అందుకుంటుంది. మహేష్ పవన్ లాంటి స్టార్స్ తో జత కడుతుంది. అయితే వీటిలో భగవంత్ కేసరి సినిమాలో శ్రీ లీల పాత్ర సర్ ప్రైజ్ చేస్తుందని టాక్. సినిమాలో ఆమెది కీలకమైన పాత్ర కాగా శ్రీ లీల పాత్ర చుట్టూ కథ ట్విస్ట్ లు ఉంటాయని తెలుస్తుంది. ఈ పాత్రను అనీల్ రావిపుడి చాలా బాగా డిజైన్ చేశారని అంటున్నారు. అందుకే శ్రీ లీల పాత్ర గురించి ఎలాంటి హింట్ బయటకు రాకుండా చాలా సీక్రెట్ గా ఉంచుతున్నారట. భగవంత్ కేసరి సినిమా శ్రీ లీల లోని మరో యాంగిల్ ని చూపిస్తుందని అంటున్నారు. సినిమా తర్వాత శ్రీ లీల రేంజ్ మరింత పెరుగుతుందని టాక్.

బాలయ్య సినిమాలో మరో పాత్ర హైలెట్ అంటే ఆ తర్వాత దశ తిరిగినట్టే. భగవంత్ కేసరి లో శ్రీ లీల తన పెర్ఫార్మెన్స్ తో మెప్పిస్తుందని అంటున్నారు. శ్రీ లీల మాత్రమే కాదు ఈ సినిమాలో కాజల్ పాత్ర కూడా కొత్తగా ఉంటుందని అంటున్నారు. ఇదివరకు కాజల్ కమర్షియల్ సినిమాలు చేయగా బాలయ్య భగవంత్ కేసరి సినిమాలో ఆమె పాత్ర కూడా డిఫరెంట్ గా ఉండబోతుందని తెలుస్తుంది. భగవంత్ కేసరి దసరా రిలీజ్ కన్ఫర్మ్ అయినట్టే. ఈ సినిమాతో బాలయ్య హ్యాట్రిక్ హిట్ కొట్టాలని చూస్తున్నారు. సినిమాలో బాలయ్య మార్క్ మాస్ మేనియాతో పాటుగా అనీల్ రావిపుడి మార్క్ ఎంటర్టైన్ మెంట్ కూడా ఉంటుందని తెలుస్తుంది.

# దహాద్ సిరీస్ హిట్టు పడ్డాక సోనాక్షిలో కొత్త జోష్

సోనాక్షి సిన్హా సరదా సముద్ర విహారం ఇప్పుడు అభిమానుల్లో విస్తృతంగా చర్చకు వచ్చింది. పాపులర్ ఐల్యాండ్ సీషెల్స్ (ఆఫ్రికా) లో సాహసోపేతమైన పర్యటనకు విచ్చేయాల్సిందిగా తన అభిమానులను టెంప్ట్ చేస్తూ ఓ వీడియోని సోనాక్షి షేర్ చేసింది. సోనాక్షి సిన్హా తన నెయిల్ బ్రాండ్ సోజీని ప్రమోట్ చేయడానికి తన బృందంతో కలిసి సీషెల్స్ కు బయలుదేరిందని సమాచారం. పనిలో పనిగా సీషెల్స్ కి బోలెడంత ప్రమోషన్ చేసింది. ఈ ప్రయాణంలో సోనాక్షి దూకుడు ఆనందం చూస్తుంటే మునుపెన్నడూ లేని జోష్ ఇప్పుడు తన బాడీ లాంగ్వేజ్ లో కనిపిస్తోందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. సోనాక్షి సిన్హా ఇటీవలి వెబ్ షో దహాద్ విజయంతో చాలా ఆనందంగా దూసుకుపోతోంది. ఈ సిరీస్ ఆద్యంతం రఫ్ కాప్ పాత్రలో సోనాక్షి అద్భుతంగా నటించింది. ఇంతలోనే తన గోళ్ల రంగు బ్రాండ్ ను ప్రచారం చేయడంలో బిజీ అయిపోయింది. ముఖ్యంగా తన నెయిల్ పాలిష్ బ్రాండ్ సోజీని ప్రమోట్ చేయడంలో బిజీగా ఉంది. ఇటీవలే సీషెల్స్ కు వెళ్లి అక్కడ టూరిజానికి ప్రచారం



చేయడమే గాక తన నెయిల్ పాలిష్ బ్రాండ్ ప్రచారంతోను డబుల్ ధమాకా ట్రీట్ ని ప్లాన్ చేయడం ఆసక్తికరం. ఓ అందమైన కొల్లాబ్ పోస్ట్ లో ఆమె బీచ్ దేశంలోని సుందరమైన ప్రదేశాలను అన్వేషిస్తూ కనిపించింది. ఈస్ట్ ఆఫ్రికన్ దేశాన్ని అన్వేషిస్తున్నప్పుడు తన సోషల్ మీడియా ఫాలోవర్ లను టీజ్ చేస్తూ కనిపించింది. అందమైన ఆహ్లాదకరమైన బీచ్ లకు పేర్గాంచిన సీషెల్స్ లో సోనాక్షి సిన్హా తన వేసవిని గడపడానికి వెళ్లింది. అక్కడ నిర్మలమైన జలాలను అన్వేషించడం తన బృందంతో కలిసి సాహస క్రీడలకు ప్రయత్నించడం ఈ వీడియోలో కనిపిస్తోంది. ఆదివారం నాడు సోనాక్షి ఇన్స్టాగ్రామ్లో తాను గడిపిన అన్ని వినోదాల ఫోటోలను షేర్ చేసింది. సీషెల్స్ క్లుప్తంగా 3 అని క్యాప్షన్ ఇచ్చింది. దీనికి అభిమానులు స్పందిస్తూ లవ్లీ –బ్యూటిఫుల్ అంటూ కాంప్లిమెంట్లు ఇచ్చారు. అయితే తన నెయిల్ బ్రాండ్ ను ప్రమోట్ చేయడానికి సీషెల్స్ కు వెళ్లిన సోనాకు ఇది అంత ఆనందాన్ని కలిగించే యాత్ర కాదు. వాస్తవానికి సోనాక్షి విలేకరుల సమావేశానికి హాజరై ఆ దేశంలో తన ఉత్పత్తి సోజీని ప్రారంభించింది. తన బేబీ ఎంటర్ ప్రెన్యూర్ వెంచర్ ను ముందుకు తీసుకెళ్లడంతో పాటు దహాద్ నటిగా సోనాక్షి సిన్హా తన తదుపరి ప్రాజెక్ట్ ల గురించి మాట్లాడింది. నికితా రాయ్ –ది బుక్ ఆఫ్ డార్క్నెస్ తో పాటు బడే మియాన్ చోటే మియాన్ లోను నటిస్తోంది. ఇందులో అక్షయ్ కుమార్ – టైగర్ ష్రాఫ్ కథానాయకులుగా నటిస్తున్నారు.




హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ స్పీడ్ పెంచింది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రకు బీజేపీ నేతలు సిద్ధమవుతున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశంతో తెలంగాణ కమలం పార్టీ నేతలు ప్రజల్లోకి వెళ్లనున్నారు. మూడు రూట్లలో బస్సు యాత్రను బీజేపీ ఫైనల్ చేసింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, జాతీయ బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టనున్నారు.

బస్సు యాత్ర కోసం 12 మందితో పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

## టీచర్ల బదిలీలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్.. ఉపాధ్యాయ దంపతులకు అదనపు పాయింట్లు



హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ టీచర్ల బదిలీలకు రాష్ట్ర హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీచర్ల బదిలీలపై విధించిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సవరించింది. అయితే టీచర్ యూనియన్ల నేతలకు పది అదనపు పాయింట్లు కేటాయించడాన్ని కోర్టు తప్పుబట్టింది. యూనియన్ల నేతలకు అదనపు పాయింట్లు ఇవ్వకుండా బదిలీలు చేసుకునేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది.

ఉపాధ్యాయ దంపతులకు మాత్రం అదనపు పాయింట్లు కేటాయించడానికి కోర్టు అనుమతించింది. టీచర్ల బదిలీలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం తరపున అదనపు ఏజీ రామచంద్రరావు, పిటిషనర్ల తరపున చిక్కుడు ప్రభాకర్, కృష్ణయ్య వాదనలు వినిపించారు.

## మల్కపేట రిజర్వాయర్‌కు చెన్నమనేని రాజేశ్వర్ రావు పేరు.. సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం



హైదరాబాద్ : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ సీనియర్ రాజకీయవేత్త, దివంగత చెన్నమనేని రాజేశ్వర్ రావు శత జయంతి సందర్భంగా (ఆగస్టు 31) ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన చేసిన సామాజిక సేవను గుర్తిస్తూ.. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో సాగు, తాగునీరు అందిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ 9 (మల్కపేట రిజర్వాయర్‌తో పాటు దాని పరిధిలోని కాల్వలకు మిడ్ మానేర్ నుంచి అప్పర్ మానేర్ దాకా)కు చెన్నమనేని రాజేశ్వర్ రావు పేరు పెడుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు సామాజిక సేవలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ మొదటి తరం రాజకీయవేత్తగా, నిరంతరం ప్రజల కోసం పోరాడిన గొప్పనేత చెన్నమనేని రాజేశ్వర్ రావు అని కొనియాడారు. తెలంగాణ రైతాంగం కోసం ఆనాటి కాలంలోనే వరద కాల్వ కోసం, ఎత్తిపోతల పథకాల కోసం పోరాడిన చరిత్ర ఆయనది. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల నుంచి అత్యంత ప్రజాదరణ కలిగిన నేత. పలు దఫాలు ఎమ్మెల్యేగా గెలిచి ఆ ప్రాంత ప్రజల సాగు, తాగునీరు కష్టాలను తీర్చడానికి ఎత్తి పోతల పథకం కోసం చెన్నమనేని రాజేశ్వర్ రావు ఎన్నో పోరాటాలు చేశారు. నాటి వారి ఆకాంక్షలను ప్రతిఫలించే విధంగా స్వరాష్ట్రంలో సాగునీరు ప్రాజెక్టులను ఎత్తిపోతల పథకాలను నిర్మించుకున్నాం. తెలంగాణ రైతాంగం నేడు దేశం గర్వించే స్థాయిలో పంటలు పండిస్తున్నారు. వారు ప్రజాప్రతినిధిగా పనిచేసిన ఆ ప్రాంత ప్రజలకు కాళేశ్వరం పథకంలో భాగంగా నిర్మించిన ప్యాకేజీ 9 ద్వారా సాగునీరు అందుతున్నది. మిడ్ మానేర్ (ఎస్ఆర్ఆర్) నుంచి ఎత్తిపోతల ద్వారా అప్పర్ మానేర్ దాకా నీటి సరఫరా జరుగుతున్నది. ఈ నేపథ్యంలో నాటి వారి కృషిని గుర్తిస్తూ, గౌరవిస్తూ, మల్కపేట రిజర్వాయర్‌కు దాని పరథిలోని ఎత్తిపోతల పథకానికి మొత్తంగా ప్యాకేజీ 9కు చెన్నమనేని రాజేశ్వర్ రావు పెట్టడం జరిగింది అని సీఎం కేసీఆర్ తెలిపారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నది.

## అధికారికంగా చాకలి ఐలమ్మ వర్ధంతి.. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన రజక సంఘాలు



హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మరుగున పడిన తెలంగాణ వైతాళికులు, పోరాటయోధులకు స్వరాష్ట్రంలో సముచిత గౌరవం లభిస్తున్నది. ఇప్పటికే అనేక మంది కవులు, పోరాట యోధుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. తాజాగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మకు స్వరాష్ట్రంలో జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 10న ఐలమ్మ వర్ధంతిని, 26వ తేదీన జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వం రజక ఫెడరేషన్‌కు సూచించింది. ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై రజక సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలనలో ఏవిధమైన గుర్తింపునకు నోచుకోని ఎందరో పోరాట యోధులను, వీరయోధులను తెలంగాణ ప్రభుత్వం గుర్తిస్తున్నదని రజకసంఘాల నేతలు కొనియాడారు. అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రజక సంఘాల సమితి రాష్ట్ర చీఫ్ అడ్వయిజర్ కొండూరు సత్యనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మీడియాతో మాట్లాడుతూ గుత్తా సుఖేందర్ రెడ్డి కేసీఆర్ గురించి ఏమన్నారంటే..



నల్గొండ: నల్గొండలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. "సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం. అభ్యర్థులను మార్చినా మార్చకున్నా పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. టికెట్ దక్కిన వారు అసమ్మతి లేకుండా అందరినీ కలుపుకు పోవాలి. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్స్ అన్నీ సాధ్యమైనవి కావు. రాజకీయాల్లో ఓర్పు చాలా అవసరం, ప్రస్తుతం నాయకుల్లో ఓపికలు తగ్గాయి. గ్రూపులు కట్టడం, అసాంఘిక శక్తులకు నేను దూరం, పాముకు పాలు పోసి పెంచొద్దు. రాజకీయాల్లో కులాలకు, మతాలకు ప్రాధాన్యత ఉండదు, ప్రజలతో మమేకమైన వారికే ఆదరణ ఉంటుంది." అని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

## బీసీల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దే : బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం

ఉప్పల్ ( హైదరాబాద్) : దేశంలో ఎక్కడా లేనివిధంగా బలహీనవర్గాలకు వేల కోట్ల విలువ చేసే స్థలాలు కేటాయించి, భవన నిర్మాణాలకు నిధులు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. బలహీన వర్గాలకు ఆత్మగౌరవాన్ని నింపిన సీఎం కేసీఆర్‌కు ఆయా వర్గాలు రుణపడి ఉంటాయన్నారు. ఉప్పల్ భగాయత్‌లో వడ్డెర కులానికి ఒక ఎకరం, సంచార జాతులకు కేటాయించిన స్థలాల్లో భవన నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు సంఘటితంగా ఉంటూ ఐక్యతను చాటలన్నారు. కుల సంఘాలలో ఐక్యత దెబ్బతీసేవారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా సంక్షేమ రంగానికి వార్షిక బడ్జెట్ (%దీబంస్త్రవ్%) లో 40 శాతం నిధులు కేటాయిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. సంక్షేమానికి విఘాతం కలిగించేవారితో అప్రమత్తంగా ఉండాలని, బీసీలు హక్కులను కాపాడుకుంటూ, జాతి అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర, కిశోర్‌గౌడ్, అధికారులు అలోక్‌కుమార్, డి.శ్రీనివాస్‌రెడ్డి, సంఘం నేతలు ఆలకుంట హరి, ఎత్తరి అంతయ్య, సత్యనారాయణ రాజు, వెంకటస్వామి, మహంకాళి భూపతికుమార్, మొగిలి వెంకటస్వామి, మురారి, వంశరాజ్ మల్లేష్, నరహరి పాల్గొన్నారు.




కోరుట్ల: కలకలం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీప్తి మృతి కేసులో మిస్టరీ కొనసాగుతోంది. దీప్తి మృతదేహానికి కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు. చేయి, ఛాతి, చెంప భాగంలో గాయాలున్నట్టు వైద్యులు గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో బుధవారం సాయంత్రం కోరుట్లలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మిస్టరీగా మారిన ఈ కేసులో ప్రస్తుతం పోస్టు మార్టం నివేదిక కీలకంగా మారింది. మరో వైపు .. దీప్తి మృతి చెందిన తర్వాత ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఆమె సోదరి కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తే మరికొన్ని విషయాలు తెలిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టు మార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. మెట్ పల్లి డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు కొనసాగుతోంది. దీప్తి మృతి తర్వాత ఇంటి నుంచి వెళ్లి పోయిన ఆమె సోదరి పంపిన ఆడియో మెస్సేజ్ చర్చనీయాంశంగా మారింది. కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఆడియో మెస్సేజ్‌ను మాధ్యమాల్లో ప్రసారం చేయొద్దని పోలీసులు సూచించారు.

**ఏం జరిగిందంటే?** కోరుట్ల పరిధిలోని భీమునిదుబ్బలో బంక శ్రీనివాస్‌రెడ్డి, మాధవి దంపతులు నివాసముంటున్నారు. వీరికి దీప్తి(24), చందన, సాయి సంతానం. దీప్తి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా ఏడాదిన్నర క్రితం చేరారు. ప్రస్తుతం ఇంటి నుంచే పనిచేస్తున్నారు. చందన బీటెక్ పూర్తి చేసి, ఇంటి వద్దే ఉంటున్నారు. కుమారుడు సాయి బెంగళూరులో డిగ్రీ చదువుతున్నాడు. బంధువుల గృహప్రవేశం ఉండటంతో ఆదివారం... శ్రీనివాస్‌రెడ్డి, మాధవి హైదరాబాద్‌కు వెళ్లారు. సోమవారం రాత్రి 10 గంటలకు వారిద్దరూ కుమార్తెలతో ఫోన్‌లో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం ఫోన్ చేయగా దీప్తి ఫోన్ లిఫ్ట్ చేయలేదు. చందన ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. వెంటనే ఇంటి ముందున్న వారికి సమాచారమివ్వగా వారొచ్చి... దీప్తి మృతి చెంది ఉండడాన్ని గమనించారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఎస్సై కిరణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దీప్తి మృతదేహం సోఫాలో పడి ఉండగా, వంట గదిలో రెండు మద్యం సీసాలు, కూల్‌డ్రింక్ బాటిల్, తినుబండారాల ప్యాకెట్లు కనిపించాయి. చందన ఆచూకీ కోసం పోలీసులు బస్టాండ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఆమె, ఓ యువకుడు కలిసి ఉదయం 5.12 నుంచి 5.16 గంటల వరకు నిజామాబాద్ బస్సులు ఆగేచోట కూర్చుని, కొద్దిసేపటికి నిజామాబాద్ వెళ్లే బస్సులో ఎక్కినట్లు రికార్డు అయింది. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. చందన, ఆమె వెంటున్న యువకుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఇంట్లోకి మద్యం సీసాలు ఎలా వచ్చాయి? ఇంకెవరైనా మద్యం తాగారా? చందన ఎందుకు పారిపోయిందనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.




బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ సీనియర్ నేత హెచ్‌డీ కుమారస్వామి అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి బుధవారం తెల్లవారుజామున కాస్త ఆందోళనకరంగా మారింది.

దీంతో కుటుంబసభ్యులు వెంటనే ఆయనను బెంగళూరులోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. ఆయనను పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దీనిపై ఆసుపత్రి అధికారులు తాజాగా హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. "బుధవారం తెల్లవారుజామున 3.40 గంటలకు కుమారస్వామి తీవ్ర జ్వరంతో ఆసుపత్రికి వచ్చారు. వెంటనే పరీక్షించి చికిత్స మొదలుపెట్టాం. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది" అని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య.. ఆసుపత్రికి ఫోన్ చేసి కుమారస్వామి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. గత వారం రోజులుగా వరుసగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కుమారస్వామి బుధవారం కూడా కోలార్‌లో పర్యటించాల్సి ఉంది. అనారోగ్యం కారణంగా ఆ పర్యటనను జేడీఎస్ రద్దు చేసింది.




ఆసిఫాబాద్: కుమురం భీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. పాఠశాలలో సరైన సౌకర్యాలు లేవని, సక్రమంగా మెనూ పాటించడం లేదని, అనారోగ్యానికి గురైన విద్యార్థినులను ఆసుపత్రులకు తీసుకెళ్లడం లేదని ఆరోపిస్తూ నిరసనకు దిగారు. అక్కడి పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థినులు రోడ్డెక్కారు. ఇవాళ ఉదయం అల్పాహారం తినకుండానే పాఠశాల నుంచి బయటకు వచ్చి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ప్రిన్సిపల్ జ్యోతి లక్ష్మి తమను వేధిస్తోందని వాపోయారు. భోజనం, వైద్యం, సరైన సమయానికి అందించకపోవడంతో నరక యాతన అనుభవిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాపలాదారులుగా ఉన్న కొందరు పురుషులు మద్యం సేవించి విధులకు వస్తున్నట్లు చెప్పారు. తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో మానసికంగా వేదనకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. సమస్య పరిష్కరించాలని పాఠశాలలో చెప్పినా పట్టించేకునేవారు లేకపోవడంతోనే తాము రోడ్డెక్కినట్లు చెప్పారు. జిల్లా పాలనాధికారి నివాసం వద్దకు వెళ్లిన విద్యార్థినులు సమస్యను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపల్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకు ధర్నాను విరమించేది లేదన్నారు.

## ఓటమి భయంతోనే కేసీఆర్ కామారెడ్డికి వెళ్లిపోయారు

సంగారెడ్డి: బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనని ప్రజలు గమనించాలని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. సంగారెడ్డి బీజేపీ జిల్లా కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంపై మండిపడ్డారు. "గజ్వేల్ ప్రజలు కేసీఆర్‌ను నమ్మి ఓటేస్తే.. ప్రజల భూములు గుంజుకుంటున్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని అన్నారు. కేసీఆర్‌ని గజ్వేల్ ప్రజలు గెలిపించవద్దు అని కోరుతున్నా. గజ్వేల్ నుంచి నేను పోటీ చేస్తానని గతంలోనే చెప్పా. గజ్వేల్ ప్రజలు ఈసారి కేసీఆర్‌కు ఓటు వేయం అంటున్నారు. గజ్వేల్ నుంచి ఓడిపోతామన్న భయంతో కేసీఆర్ కామారెడ్డికి వెళ్లిపోయారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు 30 నుంచి 40 శాతం మందికి టికెట్ రాదని ప్రచారం జరిగింది. కానీ భయపడి ఒకే సారి 115 మంది టికెట్లు ప్రకటించారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో నేరుగా కలెక్టర్లే డబ్బులు డ్రా చేసి దావత్‌లు చేశారు. కేసీఆర్ ఇచ్చే హామీలు బోలెడు. బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 19 మందిలో 12 మంది బీఆర్ఎస్ లోకి గుంజుకున్నారు. కుక్కల్లాగా మొరిగే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను పిల్లిల్లా చేశామని ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అంటున్నారు. కాంగ్రెస్ వాళ్లను ఏమనకండి వాళ్లు మనవాళ్లే అని ఇంకో ఎమ్మెల్యే అంటున్నారు. వాళ్లు మన కోవర్టులే. మనమే గెలిపించి మన పార్టీలోకి తీసుకోస్తాం అంటున్నారు. కుటుంబ పాలన వద్దంటే బీజేపీకి ఓటేయండి. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే రేపు మనకి శుభోదయం. బీజేపీకి గ్రాఫ్ బాగా ఉందని 119 నియోజకవర్గాల్లో పర్యటించిన మా ఎమ్మెల్యేలు చెప్పారు. సమన్వయం ఉంటే ఇంకా ముందుకు వెళ్లొచ్చు అని చెప్పారు." అని ఈటల వ్యాఖ్యానించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com